శ్రీ గురుదత్త జై గురుదత్త

# దత్తావతారులు

# శ్రీపాద శ్రీవల్లభులు

(వినాయక చవితి కానుక)



దిగంబరా! దిగంబరా!

శ్రీపాదవల్లభ దిగంబరా!!

శ్రీ గురుదత్త

జై గురుదత్త

# దత్తావతారులు

# శ్రీపాద శ్రీవల్లభులు

(వినాయక చవితి కానుక)



విజయవాడ
బహుధాన్య నామ
సం॥ భాద్రపద
శుక్ల చతుర్థి 25-8-98

భక్తితో సమర్పితము

శ్రీ దత్తభగవానుని సేవలో
పులుకూరు బాలకృష్ణమూర్తి
శ్రీమతి భవానీ





# విషయసూచిక

శ్రీ గణేశాయ నమః

శ్రీ సరస్వత్యై నమః



1. విన్నపము
2. తొలిపలుకులు
3. శ్రీ కాలభైరవ దివ్యవాణి
4. భగవాన్ శ్రీ దత్తాత్రేయ స్వామివారు
5. దత్తావతారులు శ్రీపాద శ్రీవల్లభులు
6. శ్రీ దత్తప్రభువుకు వందనము
7. శ్రీ దత్తప్రభువుకు జేజేలు
8. శ్రీ దత్త స్తుతి గీతము


## విన్నపము

శ్రీ దత్త ప్రభువులు వచించిన "శ్రీ దత్తగురు భగవద్గీత" అచ్చువేయవలసియున్నది. భక్తమహాశయులు వారికి తోచిన గురుదక్షిణ సమర్పించి శ్రీ దత్త సేవలో పాల్గొనమనవి. రు. 101/- గురుదక్షిణ నగదు/Mo గా/D.D. ద్వారా సమర్పించిన వారికి "శ్రీ దత్తగురుభగవద్గీత" అచ్చువేయగానే అందజేస్తాము.


ఇట్లు
శ్రీదత్తసేవలో
చిలుకూరు బాలకృష్ణమూర్తి
శ్రీమతి భవాని

41-15-4
నల్లగేట్ డౌన్
కృష్ణలంక, విజయవాడ-13
ఫోన్: 521809



## తొలిపలుకు

మా గురుదేవులు శ్రీ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి గారు దత్త భక్తులు. శ్రీ దత్త సాక్షాత్కారం పొందిన మహనీయులు. వారి అనుగ్రహంవల్ల నేను, నా శ్రీమతి శ్రీశైలంలో సాధన చేయగలగటం, బ్రహ్మమొక్కటేననియు, రెండవది లేదనియు, ఆ పరబ్రహ్మయే సృష్టి, స్థితి, లయములను చేయుచున్నాడనియు, శ్రీ దత్త భగవానుడే ఆ పరబ్రహ్మమని బోధించబడి కృతార్థులమైతిమి. త్రిముఖ, షడ్భుజ రూపంలో దర్శనమిచ్చే శ్రీ దత్త భగవానుడే పరబ్రహ్మమని విశ్వసించి, శ్రీ దత్త భగవానునే సర్వదేవ స్వరూపునిగా కొలుస్తున్నాము. శ్రీ దత్త భగవానుని సేవలో మా గురుదేవులైన శ్రీ దత్త

భక్తుల అనుగ్రహంవల్ల శ్రీ దత్త వేదము, శ్రీ దత్తసత్యసాయి శరణాష్టకము, గురుస్తుతి, శివ మహిమ్నః స్తోత్రము, శ్రీ దత్త ఉమామహేశ్వర స్తోత్రము, శ్రీ దత్త సూక్తులు, భోగభాగ్య గుళికలు, శ్రీ దత్తామృతము శ్రీ దత్త కాలభైరవ స్తోత్రము మున్నగునవి శ్రీ దత్తగ్రంథమాలగా వెలువడినవి. శ్రీ దత్త భగవానుని కృపా కటాక్షం చేత ప్రేరితులమై దత్తావతారులు శ్రీ అక్కల కోట మహారాజులవారి చరిత్ర, శ్రీ మాణిక్య ప్రభువులవారి చరిత్ర కూడా వెలువడినవి. భక్తకోటికి అందించి తరించాము.

భాద్రపద శుక్ల చతుర్థి వినాయకచవితి. ఆరోజే దత్తావతారులు. శ్రీశ్రీ పాదశ్రీ వల్లభుల జన్మదినము. ఆ పవిత్ర జన్మదిన కానుకగా "దత్తావతారులు శ్రీ పాదశ్రీ వల్లభులు" అను పేరిట శ్రీ దత్త ప్రభువుల చరిత్రను కూడా జోడించి ఈ చిరు కానుక భక్త కోటికి అందిస్తున్నాము. స్వీకరించి పఠించి, తరించ వినతి.

శ్రీ దత్త భగవానుని సేవలో

| | |
|---|---|
| బహుధాన్యనామ | చిలుకూరు బాలకృష్ణమూర్తి |
| సం॥ భాద్రపద | శ్రీమతి భవాని |
| శుక్ల చతుర్థి | 41-15-4 నల్లగేటు |
| 25-8-1998 | డౌన్. విజయవాడ-13 |



శ్రీ దత్త కాలభైరవ స్వామి

## శ్రీ కాలభైరవ దివ్యవాణి

### పరమాత్మను గురుస్వరూపంగా ఆరాధించాలి:

అవసరమైనచో, మమకారమునువీడి, శిక్షించి యైననూ, కాలమును వ్యర్థముచేయక, శీఘ్రముగా లక్ష్యమును చేర్చు గురు స్వరూపంగా, పరమాత్మను ఆరాధించాలి. నీ గురుభక్తి ఎంత నిజమైనదో దక్షిణలోనే తేలిపోవును. ఆ గురుదక్షిణ, నీ కాలమునూ, శక్తిని వ్యయముచేసి సంపాదించిన ధనమునుండి కావచ్చును. లేక, ధనము నీ అవసరముల వరకే యున్నచో, నీకున్న కాలము- శక్తినుండి గురుసేవకు కొంత దక్షిణగా సమర్పించవచ్చును. నీ అవసరములకు కావలసిన ధనము సంపాదించుటకు వినియోగించు కాలము- శక్తినుండి కానీ, నీ విశ్రాంతి కాలము నుండి కానీ, గురుదక్షిణ కోరబడదు. ఈ

రెండు (కర్తవ్యములు, విశ్రాంతి) పోను మిగిలిన కాలమును-శక్తిని అనవసరముగా ఖర్చుచేయక, దైవమునకు గురుదక్షిణగా సమర్పించిన, అదిచాలు-తరించుటకు! అవసరములకు తగినంత ధనమున్ననూ, ఇంకనూ, కాలమునూ—శక్తిని ఖర్చుచేసి ధనము నార్జించు లోభి, కాలమునూ శక్తినీ ధనరూపంలోకి మార్చుకొని, నిల్వ చేయుచున్నాడు. ఇట్టి లోభి, అనవసరంగా కాలమునూ-శక్తినీ దుర్వినియోగం చేసేవారి కన్ననూ ఎంతో మేలు. ఏల ననగా-తరువాత, యీ లోభి, దైవము వైపునకు తిరిగినపుడు తన అధిక ధనమును గురుదక్షిణగా చేసి (కర్మఫల త్యాగము) నచో, ఆ అధికధనమునకై ఖర్చుచేసిన శక్తినీ దుర్వినియోగము చేసినవారు, తరువాత, తమ పొరపాటును దిద్దుకొను అవకాశము లేనివారు!

స్వార్థము అనురోగమువలన, కోరికలను సంపాదించుకొనుటకు పరమాత్మను సాధనముగా చేసుకొనుట ఈ కలి కాలములో ఎక్కువైనది. పరమాత్మను ప్రసన్నము చేసుకొనుటకై పూజలను కర్మమార్గమూ, భజనలను భక్తిమార్గమూ, ధ్యానము అను యోగమార్గమూ బాగుగా వృద్ధి చెందినవి. కనుక వీటిని ఇంకనూ వృద్ధిచెందించ నవసరములేదు. పెంచ వలసినది జ్ఞానము (అవగాహన). ఈ ఒకానొక పరమాత్మ స్వరూపము ఐహికములైన నీ కోరికలను ప్రసాదించదు అని, (పరీక్ష కొరకు) అన్నంత మాత్రముననే, నీవు ఆ రూపమునకు ఒక్క నమస్కారమును పెట్టి దాని జోలికి పోవుటలేదు! ఈ స్వార్థరోగమునకు కారణములు "నేను", "నాకు" అను రెండు విషక్రిములు. వాటిని సంహరించి, స్వార్థరోగమును

నయము చేయు జ్ఞానమే సరియగు ఔషధము. పరమాత్మ భూలోకమున తలపెట్టిన జ్ఞాన ప్రచార కార్యక్రమమున సేవకునిగా శిష్యునిగా, పాల్గొని, పదిమందికీ ప్రచారము చేయుట వలన, తనవంతు బట్టును కాన, "ఇది అన్య కార్యమూ కాదూ, స్వామి కార్యమూ కాదు, స్వకార్యమే"నని గ్రహించి, సహకరించి, తరించవలయును.

పరమాత్మ భవరోగవైద్యుడు. నీవు ఆయన సేవకుడవు. సేవకునిగా నీవు నిన్ను సమర్పించు కొన్నవెంటనే ఆయన నిన్ను ముక్తుని చేయుచున్నాడు. ఏలననగా ముక్తుడు కాని వాడు, బద్ధులనెట్లు విడిపించు ప్రచారము చేయగలడు? ఈత రాని వానిని, ఇతరులకు ఈతను నేర్పుటకు ఉపయోగించునా? కాన, వైద్య సేవకుడవైన నీవు వైద్యుడగు స్వామి చెప్పినట్లు చేయవలయును కాని, స్వతంత్రించరాదు. రోగిని బుజ్జగించియైనను ఔషధమును త్రాగించు బాధ్యత నీది. అంతే కాని, రోగి, ఔషధమునకు, చేదుగానున్నది కాన, విముఖుడగుచున్నాడని, కర్మ-భక్తి-యోగ మార్గములను, రోగి కోరుచున్నాడని ఆహారములైన గారెలు-పాయసము-లడ్లు పెట్టినచో, రోగము శమించక ముందు, అవి తిన్న, విషములై, ఇంకనూ రోగము పెరుగును. ఆ కాలమున, గురువు ఏది కోరుచున్నాడో ఆ సేవయే (కాలోచితసేవ) చేయుము. గురువు

గారు ఆ కలితో ఆహారమును కోరగా, అది పెట్టక, చందన-వింజామరలు మొ॥సేవలు చేయుట తగునా? స్వామి సంక ల్పించినంత మాత్రమున, రోగికి రోగమును మాయము చేయ గలరని తెలుసుకొనుము. ఈ సేవద్వారా నిన్ను తరింప చేయుటకే చేయుచున్నాడు. కాన, ఆయన నీకు సాయపడు చున్నాడే తప్ప,ఆయనకు నీవు సాయపడుటలేదని గ్రహిం చుము. శ్రీరాముడు సంకల్పించినంత మాత్రముననే రావణ సంహారము చేయగలడు. సముద్రుడూ తన పుత్రికయగు లక్ష్మి దేవియగుసీతను కాపాడపోవురామునకు దారినీయగలడు. కాని రామసేవచేయుఅవకాశమును వానరులకుకల్పించదలచి వారధి నిర్మాణమును తలపెట్టెను. అందులో కూడ, పెద్ద బండలు వేయు వానరులు అవి మునుగుచుండగా, రామకార్యమును గురించి శంకించి, పనిని మాని తిరిగి వచ్చిరి. అట్టి వారిని, రాముడు వీపు నిమురలేదు. రామ కార్యమును గురించి ఎట్టి శంకయూలేక, తనశక్తి కొలదీ సేవ చేయవలయునని, ఉడత, కొన్ని ఇసుకరేణువులను, శరీరముపై పులుముకొని, తెచ్చి సముద్రములో వేయుట చూచి, దానివీపుపై నిమిరినాడు. రామానుగ్రహము శాశ్వతముగా దాని వంశమంతటను వీపులపై మూడు చారలుగా [త్రిమూర్తి స్వరూపమైన దత్త సంకేతము] పడినది! కాన, స్వామికార్యము గురించి శంకింపక

నీ శక్తి కొలదీ, ఉడతవలే, గురుస్వామి కార్యమున సేవకునిగా పాల్గొని తరించుము.


ఈ జ్ఞాన మార్గములో ముఖ్యముగా నీవు ప్రచారము చేయవలసినది ఏమనగా— పరమాత్మను జ్ఞానము ద్వారా బాగుగ తెలుసుకొని, ఆయనపై సహజమైన, అప్రయత్న సిద్ధమైన ఆకర్షణ ఏర్పడి, ఆ ఆకర్షణ కారణంగా ఆయననూ కర్మ-భక్తి- యోగములద్వారా ఆరాధించవలయునేకాని, నీ కోరికలను తీర్చుకొనుటకు, కోరికల ఆకర్షణము వలన, ఆయనను సాధనముగా చేసుకొని, దాని కొరకు ఆయనను ప్రసన్నుని చేసుకొనుటకుగాను, ఆయనపై ఆకర్షణయున్నట్లు నటించు ఆరాధనలను, చేయరాదు. నీ ఇంటికి బిచ్చగాడు వచ్చి నిన్ను ఎంతో పొగడుతాడు. కానీ వానిని పొమ్మంటావు అథవా, నీవు తినుటకు పనికిరాని పిడికెడు చద్దిమెతుకులు వేసి పొమ్మంటావే తప్ప పూర్ణ భోజనమునుపెట్టవు. అదే ఒక అతిథివస్తే, నిన్ను పొగడకపోయినా, పోతానంటే బలవంతంగా ఉంచి, ఎక్కువ రకాలువండించి, వద్దన్నా ఎక్కువ వడ్డిస్తావు! ఆ ఇద్దరిలో ఆ తేడా ఎందుకు? బిచ్చగాడు నీ కోసం రాలేదు. అన్నంకోసం వచ్చాడనీ, అతిథి అన్నంకోసం రాలేదు. నీ మీద ఆప్యాయతతో వచ్చాడనీ, నీకు తెలుసు కాన, బిచ్చ గాడిని అలా చూశావు. అతిథిని ఇలా చూశావు! ఇదే విధంగా, పరమాత్మవద్ద నీవు ప్రస్తుతము బిచ్చగాడివిగా ఉన్నావు. ఇది వద్దు. అతిథిగా వెళ్ళుము. అతిథివలె ఆయనచే ప్రేమగా ఆదరించబడుము. అతిథిగాయున్నచో నీకు కావలసిన దాని కన్ననూ అధికముగా ఆయనచే ఈయబడును. అంతేకాదు.

నీకు నిజంగా ఏది మంచి చేయునో, నీవు తెలుసుకొనలేని అజ్ఞానివి. నీకు హితమును చేయునదేదియో ఆయనకు తెలియును. దానిని నీకు అధికముగా ఇచ్చును. నీవు కోరిన దంతయూ నీకు అపకారము చేయునదేకాన, స్వల్పముగా యిచ్చువలె దానినివేసి పంపుచున్నాడని తెలియుము. అందులో కూడ ఆయన యొక్క అపార కారుణ్య - వాత్సల్య స్వభావమును గుర్తించుము. ఆయన యొక్క అంతరార్థమైన వాత్సల్యమును గుర్తించక, యాచించిననూ, యీయ లేదనియూ, లేక తక్కువ ఇచ్చినాడనియు, ఆయనను అజ్ఞానివి కాన, ద్వేషించుచున్నావు.



దత్తభక్తులు

శ్రీ జన్నాభట్ల
వేణుగోపాలకృష్ణమూర్తి



భగవాన్ శ్రీ దత్తాత్రేయ స్వామి

శ్లో॥ గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పర బ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః

గురుదేవుడే బ్రహ్మ విష్ణువు మహేశ్వరుడు. ఇంతేకాదు ఆయన సాక్షాత్తు పరబ్రహ్మ. అట్టి గురుదేవులకు నమస్కారము ఇది మన ప్రార్ధన. ఐతే ఈ పరబ్రహ్మ ఎవరు?నిర్గుణబ్రహ్మమే ఈ పరబ్రహ్మ. ఇప్పుడు నిర్గుణబ్రహ్మము అంటే ఏమిటో

తెలుసుకుందాం. సృష్టి, స్థితి, లయములు అను మూడు కార్యములు ఒక్క బ్రహ్మమే చేయుచున్నదని శ్రుతివాక్యం. బ్రహ్మదేవుడు సృష్టి కార్యము చేయుచున్నాడని, విష్ణుమూర్తి పాలించుచున్నాడని, ఈశ్వరుడు లయము చేయుచున్నాడని మనం పెద్దల ద్వారా తెలుసుకున్నాంగదా. వీరే త్రిమూర్తులు. సృష్టి స్థితిలయములు అనుమూడు కార్యములు చేయుచున్నది ఒక్క బ్రహ్మమే అని కదా వేదములు చెప్పుచున్నది. ఆ త్రిమూర్త్యాత్మకుడైన పరబ్రహ్మమే శ్రీ దత్తాత్రేయ భగవానుడు. అట్లు ఈ సత్యమును నిరూపణచేయుటకే స్వామి మూడు ముఖములు ఆరు హస్తములతో దర్శనమిస్తున్నారు. బ్రహ్మ, విష్ణు, శివ ముఖములు, శంఖ చక్రములుపై రెండు హస్తములయందు, త్రిశూల ఢమరుకములు మధ్య రెండు హస్తములయందు, కమండలము, అక్షమాల క్రింది రెండు హస్తములయందు ధరించినారు. స్ఫటిక మాల బ్రహ్మదేవుని తులసిపూసలమాల విష్ణుదేవుని రుద్రాక్షమాల శివదేవుని సూచిస్తున్నవి. మధ్యవిష్ణురూపము ఇటు అటు బ్రహ్మ శివ ముఖములను కలిగి శ్రీ దత్త పరబ్రహ్మ దర్శనమిస్తున్నారు. గురోః గురు తరాయనమః గురువులకు గురువే శ్రీ దత్త భగవానుడు. స్మరణ మాత్ర సంతుష్టుడు. భోగమోక్షప్రదుడు. పిలువగానే పలికేవాడు. విశ్వగురువు. దయామయుడు భక్త వత్సలుడు దీనబాంధవుడు శరణాగత వత్సలుడు సాక్షాత్తు నారాయణుడు, పరబ్రహ్మము, సదాశివుడు ఆది పరాశక్తి సర్వమంగళకరుడు సర్వక్లేశహరుడు భక్తాభీష్టప్రదుడు సర్వ

రోగహరుడు. వేయేల స్వామి సర్వ ఐహికములను ఆముష్మికములను ప్రసాదించు ప్రత్యక్ష దైవము.

శ్రీ దత్త భగవానుని చిత్రపటము చూడండి. స్వామి పాదుకలు ధరించియున్నారు. స్వామి అంటున్నారు. "నన్ను ఆరాధించుటకు నా పాదుకలు చాలును. ఏలనన్నచో నా పాదుకలను వేదములే కుక్కల రూపములో నాకుచున్నవి. అన్ని అపవిత్రతలను పోగొట్టగల వేదాలే అపవిత్రశునకములై నా పాదములవద్ద నుండగా నా పవిత్రతను ఊహించుటకు నరులకు అసాధ్యము అని. శ్రీ దత్త భగవానుని, ధర్మ దేవుడైన యమధర్మరాజు, గోరూపంలో సేవించు చున్నాడు.

స్వామి అంటున్నారు. "నేను భోగమోక్షప్రదుడను. భోగములనిచ్చి తృప్తి నొందించి, జీవులకు ఆవల మోక్షము నొసంగు చున్నాను" అని. స్వామి ఇంకా ఇలా అంటున్నారు. "నా నుండి త్రిమూర్తులు. వారి నుండి మూడు కోట్ల దేవతలు, వారినుండి 33 కోట్ల దేవతలు, వచ్చినారు. నాకు పెట్టిన ఒక్క నమస్కారము 33 కోట్ల నమస్కారములగును" అని. స్వామి ఇంకా ఇలా అంటున్నారు. "నా బ్రహ్మముఖమునకు ఋషి పూజయు, విష్ణుముఖమునకు శ్రీ సత్యనారాయణవ్రతము విష్ణుసహస్రనామ పూజయు, రుద్రముఖమునకు రుద్రాభిషేకము చేయుము. బ్రహ్మర్షులందరు బ్రహ్మాంశలే. దేవతలందరూ విష్ణురుద్రాంశలే. నా బ్రహ్మముఖ జిహ్వాయందు వాణియు, నా మధ్య వక్షమందు లక్ష్మియు, నా శివముఖవామ భాగమున గౌరియు ప్రకాశించుచున్నారు. ఈ ముగ్గురు శక్తులు కలసిన దుర్గయు నాయందేయున్నది. నాకన్నా వేరుకాని ఆ

శక్తియే శ్రీ శక్తి గణపతి. కుమారస్వామి, వీరభద్రాది శైవ రూపాలు, రామకృష్ణ నరసింహాది విష్ణురూపాలు నాలో లీనమై యున్నాయి. హరిహరాత్మకుడైన మణికంఠుడు నా హరిహర ముఖాలే. త్రిమూర్తుల అంశయైన హనుమంతుడు నాయందే కనిపించును." అని అన్నారు. కనుక శ్రీ దత్తాత్రేయ స్వామి బ్రహ్మ విష్ణు శివాత్మక, వాణీహిరణ్యగర్భాత్మక, లక్ష్మీ నారాయణాత్మక, ఉమామహేశ్వరాత్మక, సర్వబ్రహ్మర్షి ఆత్మక, సర్వసిద్ధాత్మక, సర్వగ్రహాత్మక, సర్వదేవతా దేవాత్మకుడు. సర్వేశ్వరుడు. తిరుమలలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారు, శ్రీ శైలంలో వెలసిన శ్రీ మల్లి కార్జునస్వామివారు, అన్నవరంలోని శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారు సాక్షాత్తు దత్త ప్రభువులే. శ్రీ కృష్ణుడు సాక్షాత్తు శ్రీ దత్తమూర్తియే ఇది సత్యం.

కలియుగములో పిఠాపురంలో వెలసిన శ్రీపాద శ్రీవల్లభులు, కరంజాలో వెలసిన శ్రీ నరసింహ సరస్వతి స్వామివారు [గానుగాపురం] అక్కల్‌కోట మహారాజులవారు, మాణిక్యప్రభువులవారు, శిరిడిసాయినాథుడు, వర్తమానంలో పుటపర్తిలో వెలసిన శ్రీ సత్యసాయినాథుడు సాక్షాత్తు దత్తావ తారులే ఎట్టి సందేహంలేదు.

ఇట్టి మహనీయుని చరిత్ర మనము తెలిసికొని జీర్ణించు కొని, సాధనచేసి, స్వామియొక్క అపార కరుణకు పాత్రుల మగుదముగాక.

కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము కలియుగము అని యుగములు నాలుగు. అందులో కృత యుగమునందు జనార్దనుడనియు, త్రేతాయుగమున శ్రీరామ చంద్రుడనియు, ద్వాపరయుగమున శ్రీకృష్ణభగవానుడనియు, పెద్దలు చెప్పుచున్నారు. మరి కలియుగమునందు దైవమెవరు? కలౌ వేంకటనాయకః అన్నారు. అంటే కలియుగమున ప్రత్యక్షదైవము శ్రీ వెంకటేశ్వరస్వామి అన్నారు. అట్లే కలౌ శ్రీ పాద శ్రీవల్లభః అని చెప్పినారు. అనగా కలియుగములో శ్రీపాద శ్రీవల్లభులే దైవముగా ఆ దైవమే వెలిశారని అర్థము. శ్రీ దత్తావతారములలో కలియుగంలో ప్రథమము శ్రీపాద శ్రీ వల్లభస్వామివారు. వీరు మన ఆంధ్రదేశములో పిఠాపురం గ్రామంలో వెలిశారు.

శ్రీదత్తాత్రేయస్వామివారు కలియుగానికి పూర్వము 16 అవతారములతో దర్శనమిచ్చారని శ్రీవాసుదేవానంద సరస్వతీ స్వాములవారు పేర్కొన్నారు. అవి యేవనగా– 1. యోగిరాజు 2. అత్రివరదుడు 3. శ్రీదత్తాత్రేయుడు 4. కాలాగ్నిశమనుడు 5. యోగిజనవల్లభుడు 6. లీలా విశ్వంభరుడు 7. సిద్ధిరాజు 8. జ్ఞానసాగరుడు 9. విశ్వంభ రావధూత 10. మాయాయుక్తావధూత 11. మాయాముక్తావ ధూత 12. ఆదిగురువు 13. శివరూపుడు 14. శ్రీదేవదేవుడు 15. దిగంబరుడు 16. శ్రీకృష్ణశ్యామకమల నయనుడు.

శ్రీదత్తాత్రేయస్వామివారు అత్రిమహాముని, అనసూయ దేవియొక్క పుత్రుడని పెద్దలు చెప్పినారుగదా. సప్తమహా

ఋషులలో అత్రిమహాముని యొకరు. వీరు బ్రహ్మదేవుని పుత్రులు. అత్రిమహాముని పత్నియే అనసూయాదేవి. ఈమె మహాపతివ్రత. నారద మునీంద్రులు ఈమె పాతివ్రత్య మహిమను జగతికి వెల్లడించుటకు పూనుకొనిరి. ఇనుపగుగ్గెళ్ళు తీసుకువెళ్ళి శ్రీనారదులవారు సరస్వతి, లక్ష్మి, పార్వతీ దేవులకు ఇచ్చి, "అమ్మా! ఈ ఇనుపగుగ్గెళ్ళను నాకు వండి పెట్టండి. నాకు వచ్చిన కడుపునొప్పి తగ్గుతుంది" అని ప్రార్థించెను. వారు నవ్వి, "నాయనా ఇనుపగుగ్గెళ్ళేమిటి? వండిపెట్టుట ఏమిటి? ఇది ఏలా సాధ్యమని పరిహసించిరి. అప్పుడు నారదులవారు ఆ గుగ్గెళ్ళను తీసుకొని భూలోకము నకు వచ్చి అనసూయ మాతకు ఇచ్చి వాటిని వండిపెట్టినచో తాను తిని తన కడుపులోని బాధను తీర్చు కొందునని ప్రార్థించెను. ఆమె వెంటనే లోనికిపోయి భర్తను తలచుకొని వాటిని ఉడికించగా అవి అన్నమయ్యెను. ఆ అన్నమును నారదుడు భుజించి, సంతోషించి, ఆమె ఆశీశ్శులుపొంది వెడలిపోయెను. అక్కడనుంచి నారదులవారు వాణి, లక్ష్మి, గౌరీదేవులకు ఈ వృత్తాంతము పూసగుచ్చినట్లుచెప్పి, అనసూయాదేవి పాతివ్రత్యమహిమను కీర్తించగా, ముగురమ్మలు ఆశ్చర్యచకితులై, ఆమె పాతివ్రత్య మహిమను స్వయముగా పరిక్షించమని తమ భర్తలైన త్రిమూర్తులను ప్రార్థించిరి. త్రిమూర్తులు అనసూయా దేవియొక్క పాతివ్రత్య మహిమను తెలిసిన వారయ్యును, ఆమెపాతివ్రత్య మహిమను లోకమునకు వెల్లడించుటయేకాక, లోకోద్ధరణ మహాకార్యమునకు ఆ ఋషిదంపతుల ప్రేరే పించుటకు అంతర్యమున సంకల్పించి బయలుదేరిరి.

త్రిమూర్తులు సన్యాసుల వేషములధరించి, అత్రిముని తపమునకు అరణ్యమునకు వెళ్ళిన తర్వాత, వారి ఆశ్రమమునకుచేరి, అమ్మా! భిక్షాందేహి యనిరి. అత్రిముని తపమునకు వెళ్ళిరనియు, రాగానే అందరికి వడ్డింతునని, అనసూయ సమాధానమిచ్చెను. అప్పుడు వారు "అమ్మా! మాకు చాలా ఆకలిగాయున్నది. అత్రిమునివచ్చుటకు ఏవేళయగునో, కనుక మాకు భిక్షఇడి మా ఆకలి తీర్చమని కోరిరి. అందుకు ఆమె "అభ్యాగతి స్వయం విష్ణుః" అని సంకల్పించి — "నాయనాలారా! రండు వడ్డింతు"నని చెప్పి, విస్తళ్ళువేసి, భోజనమునకు ఆహ్వానించినది. అప్పుడు త్రిమూర్తులు ఆమెతో ఇట్లనిరి. "అమ్మా! మాకు ఒక వ్రతమున్నది. మాకు భిక్షనిడుసాధ్వి వివస్త్రగా వడ్డించవలె. కనుక ఇప్పుడు నీవు మాకు భిక్షనిడెదనని యంటివిగదా. సంతోషము. కాని నీవు మాకు వివస్త్రవై వడ్డించవలె. లేనిచో మేము ఆకలితోనే వెడలిపోయెదము" అనిరి. అప్పుడు ఆమె ఆలోచించినది. ఏమిటి ఈ అసాధారణ నియమము. వీరు సామాన్యులుకారు. వీరు సాక్షాత్తు త్రిమూర్తులని తెలుసుకొని నవ్వుకొన్నది. "సరే నాయనలారా! రండు అట్లే వడ్డింతును" అని చెప్పి వారిని సుఖాసీనులచేసి వంటఇంటిలోనికివెళ్ళి భర్తను స్మరించినది. అంతే! వారు ముగ్గురు బోసినవ్వుల పసిపాపలైనారు. అప్పుడు ఆమె మాతృత్వము పొంగినది. ఆమె వివస్త్రగా వారికి స్తన్యపానము గావించి ధన్యురాలైయ్యెను. వారిని

ఊయలలో పరుండపెట్టి - "జో అచ్యుతానంద జోజో ముకుందా! లాలిపరమానంద రామగోవిందా! జో జో!" అని పాడినదట. వారు ముప్పురు ఆలసిన వారివలె గాఢనిద్రలో నికి వెళ్ళిరట. ఇంతలో అత్రి మహాముని వచ్చిరి. అత్రి మహాముని విషయం నంతయు తెలుసుకొని త్రిమూర్తుల ప్రార్థించగా వారు ఆ పసిపాపల రూపాలను విడనాడి మరల త్రిమూర్తుల రూపాలను పొంది అత్రి అనసూయల కొనియాడిరట. ఆ పుణ్యదంపతులను వరం కోరుకొన మనిరట. అప్పుడు ఆ దంపతులు, త్రిమూర్తులే తమకు సంతానం కావలయునని కోరిరట. అప్పుడు బ్రహ్మదేవుడు చంద్రునిగను, విష్ణువు శ్రీ దత్తాత్రేయుడుగను, రుద్రుడు దుర్వాసునిగను వారికి పుత్రులై జన్మించిరట. త్రిమూర్తులు అంతర్ధానమైనరట. ఇదియొక కథ.

శ్రీ జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తిగారు నరసరావు పేట వాస్తవ్యులు. వీరు దత్తోపాసకులు. వీరి పూర్వ పుణ్య ఫలముగా శ్రీ దత్తాత్రేయ స్వామివారు వీరికి సాక్షాత్కరించారు. వీరికి సర్వకాల సర్వావస్థల యందు ప్రసన్నునే. వీరినే దత్త భక్తులంటాము. మా దంపతులము శ్రీ దత్త భక్తులతో కలసి శ్రీశైల మహాక్షేత్రమున కొన్ని దినములు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని సేవించితిమి. శ్రీ దత్త భగవానులు శ్రీ దత్త భక్తులకు సాక్షాత్కరించుచు ఎన్నో విషయములు చెప్పిరి. అవి అన్నియు శ్రీ దత్త భక్తులు మాకు చెప్పెడివారు. ఆ విషయములన్నియు "శ్రీ దత్త వేదము" అను పేర గ్రంథము వెలువడెను. ఆ గ్రంథమును చదివి ఆ దత్తామృతమును గ్రోలి ఆనందించవలెనేకాని ఇక్కడ ఇప్పుడు ఎక్కువగా చెప్పలేము.

శ్రీ దత్త చరిత్ర దత్త భక్తులకు శ్రీ దత్త భగవానులే వచించినది. క్లుప్తముగా ఇచ్చట మనవి చేయుచున్నాము.

అత్రి మొదలగు మహాఋషులు విచారణ చేయుచు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను మనము దర్శించుచునే యుంటిమి. బ్రహ్మలోకము, వైకుంఠము, కైలాసము వారి వారి నివాస స్థానములని మనకుయెరుకయే గదా. బ్రహ్మ సృష్టి కర్తగను, విష్ణువు స్థితికారకుడుగను, రుద్రుడు లయ కారకుడుగను మనము యెరిగియుంటిమిగదా! మరి వేదము లలో "ఏకమేవ అద్వితీయం బ్రహ్మ" బ్రహ్మమొకటే రెండ వది లేదు. ఆ ఒక్క బ్రహ్మమే సృష్టి, స్థితి, లయములను మూడు కార్యముల చేయుచున్నదని చెప్పబడినదికదా! మరి ఆ పరబ్రహ్మమెవరు? అని ప్రశ్నించుకొనిరట. అప్పుడు ఋషిమండలి "మనమందరము శ్రీ అత్రి మహాముని నాయకత్వములో ఆ పరబ్రహ్మకొరకు తపమాచరింత మని" నిర్ణయించిరట.

ఋక్ష పర్వతాగ్రమున అత్రి అనసూయలు, ఈ మహా ఋషుల మండలితో ఏకాగ్రముగా తపస్సు చేసిరట. అది కృత యుగమునాటిమాట. త్రేతాయుగము ప్రవేశించినదట. శ్రీ అత్రి మహాఋషి ఏకాగ్ర తపస్సుకు సంతసించి పరబ్రహ్మము అను గ్రహించ దలచినదట. ఈ ఋషీశ్వరుడు వేదార్థము ఎంత వరకు అవగాహన చేసుకొనెనో పరీక్షించ సంకల్పించి, పర బ్రహ్మము-త్రిమూర్తుల రూపములలో-బ్రహ్మ, విష్ణు, మహే శ్వరునిగా దర్శన మిచ్చినారట అత్రిమునికి. అప్పుడు అత్రి

ముని "నేను పరబ్రహ్మమునకై తపస్సు చేయుచుండగా త్రిమూర్తులు దర్శనమిచ్చితిరేమి?" అని ప్రశ్నించిరట! అప్పుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు తమలో బ్రహ్మ సృష్టి కర్తయనియు, విష్ణువు పాలన కర్తయనియు, రుద్రుడు లయ కర్తయనియు తెలిపి మేము ముగ్గురము కలసి పరబ్రహ్మమని రట. అత్రి అంగీకరించలేదట వేదప్రమాణము ప్రకారము పర బ్రహ్మము ఒక్కరేకాని ముగ్గురు కాదు. ఆ ఒక్కరే సృష్టిస్థితి లయముల చేయవలెను గాని విడివిడిగా ముగ్గురు చేయుట కాదు అని అత్రిత్రిమూర్తులనునిరాకరించెనట.అప్పుడు త్రిమూ ర్తులు ఇట్లు వచించారట. "నాయనా! నీవు తపస్సు చేసిన అద్వి తీయుడైన బ్రహ్మము యొక్క గుణాలమే మేము. ఆనిర్గుణ పరబ్రహ్మ సంకల్పంచేతనే ఒక్కడే అయిన నిర్గుణబ్రహ్మము గుణకర్మలకొరకు అనగా సృష్టి, స్థితీ, లయముల కొరకు ముగ్గురుగా మారినది. ఆ మూర్తులమే మేము. అనగా ఒక్కటి మూడైనది. అంతే. నీ తపస్సుకు మెచ్చితిమి. ఇప్పుడు నీకు పరబ్రహ్మము రూపంలో దర్శనమిత్తుము. దర్శించమనిరి. అప్పుడు శ్రీ అత్రి అనసూయలకు పరబ్రహ్మము త్రిముఖ, షడ్భుజ రూపంతో దర్శనమిచ్చారు. ఆ దివ్యదర్శనము కాగానే అత్రిముని దత్తః దత్తఃఅనగా"దొరికినది"అని కేకలు పెట్టారట. అప్పుడు అందరు ఋషులు దత్తః దత్తః అని

కేకలు పెట్టారట. అప్పుడు ఆ పరబ్రహ్మమునకు దత్త పర బ్రహ్మమని పేరు వచ్చెను. ఆయనయే శ్రీ దత్తాత్రేయ భగవానుడు. త్రిముఖ షడ్భుజ రూపమే పరబ్రహ్మము. త్రిమూర్తులు, దేవతలందరు పరబ్రహ్మము యొక్క గుణములే కాని వేరు కాదు.

శ్రీ దత్త భగవానులు ఇలా వచించారు. "నాయనా! విను. పరబ్రహ్మము ఒక్కటే. రెండవదిలేదు. నేనే ఆ పర బ్రహ్మమును. నేనే సృష్టి, స్థితి, లయములను చేయుచున్నాను నా నుండి త్రిమూర్తులు,వారినుండి 33కోట్లదేవతలు వచ్చినారు వారెల్లరు నా వేషాలే నాగుణములే.వేషధారిని నేనే. సృష్టి, స్థితి, లయకర్మలద్వారా సులభంగా గుర్తించదగిన నాయొక్క పలు చనివేషములే ఈ త్రిమూర్తులు.గుర్తుపట్టుటకువీలుకానిదట్టమైన నా వేషములే ఇతర దేవతలు. మరియు ఈ విశ్వంలోని వస్తు రూపాలు. నేను గురు స్వరూపమున బ్రహ్మదేవుడను. నా జిహ్వాయందు వాణిశక్తి యున్నది. మాతృ స్వరూమున నేను విష్ణువైయున్నాను. ఐహికములనిచ్చు లక్ష్మి నా హృదయస్థాన మున యున్నది. అర్థనారీశ్వరుని నేనే. నా వామభాగమున శక్తియగు తల్లిగాను, దక్షిణ భాగమున గురువగు శివునిగాను ఉన్నాను. నేనే దత్త పరబ్రహ్మమును. దత్తుడనగా చిక్కిన వాడు అని అర్థం. ఈ శబ్దం ఏ వస్తువు నామము కాదు. నా

పేరు పరబ్రహ్మమే "దత్తుడు" కాదు నల్లని కలువ అనగా-కలువయే పేరుకాని 'నల్లని' పేరు కాదుగదా. కనుకనే త్రిమూర్తులు, వారి అంశలైన ఇతర దేవతలు మరియు అన్ని లోకాలు నా ఊహాకారములే. మూడు ముఖములు ఆరు చేతులుగల ఏకైక రూపమగు నేనే సత్యం. నా సృష్టిగుణమే బ్రహ్మ. నా పాలన గుణమే విష్ణువు. నా లయ గుణమే రుద్రుడు. నా ధైర్యగుణమే హనుమంతుడు" అని వచించారు.

శ్రీ దత్త భగవానుడు సర్వశక్తి సంపన్నుడు. సర్వ సమర్థుడు. ఆయన శక్తిని తెలుసు కొనుటకు దేవతలకుగాని, ఋషులకు గాని అలవికాదు. ఊహకు అందు పనులను, ఊహకు అందని పనులను స్వామి చేయగలడు. ఆయనకు సాధ్యా సాధ్యాలంటూ లేవు. సర్వ శక్తిమంతుడగు స్వామి అన్ని విధములుగా యుండగలడు. అన్ని విధములుగా చేయ కలడు.

కనుక మనం నిష్కామంగా స్వామిని ఆరాధించాలి. కోరిక లుండరాదు. అర్జునుడు కృష్ణ భగవానుని తన కార్యమునకు ఉపయోగించుకున్నాడు. కనుక శ్రీకృష్ణుడు నిర్యాణం చెందగనే, అర్జునుడు శక్తివిహీనుడైనాడు. హనుమంతుల వారిని చూడండి... ఆంజనేయుడు తనను స్వామి సేవకే ఉపయోగించు

కున్నాడు. కనుకనే చిరంజీవియై రామానంతరము కూడా శక్తిమంతుడుగానే యున్నాడు. కనుక సాధన నిష్కామంగా యుండాలి. స్వార్థము పనికిరాదు. స్వార్థము లేనప్పుడే భగ వంతునిపై ప్రేమ కలిగియున్నట్లు, స్వార్థమున్నంతవరకు ప్రేమకు చోటులేదు. కనుక స్వామిని నిష్కామంగా అరా ధించాలి.

కలియుగంలో మనుష్యునికి ఆయుర్దాయం వంద సంవ త్సరాలు అంటారు. కాని మనం చూస్తున్నాము. పూర్తిగా 100 సంవత్సరాలు బ్రతికినవాళ్ళు చాలా చాలా అరుదు. 70-80 సంవత్సరాలు బ్రతికితే గొప్ప. ఇది మన పరిస్థితి.

ఇదే మన పెద్దలు ఎలా చెప్పారంటే. మానవుని జీవితం 100 సంవత్సరాలని, అందు సగభాగం అంటే 50 సం॥ నిద్రలో పోతుందని, మిగిలిన 50 సంవత్సరాలలో కొంత బాల్యంలోను, కొంత ముసలితనంలో పరాధీనత వలన ఖర్చు అవుతుందని ఇక మిగిలిన కాలం సంసార లంపటంలో భార్యా, బిడ్డలతో గడిచిపోతుందని చెప్పారు.

కనుక మనం ఔనన్నా, కాదన్నా కాలచక్రం గిర్రున తిరుగుతుంది. బాల్యం, తర్వాత కౌమారం, తర్వాత యవ్వనం, తర్వాత వృద్ధాప్యం తప్పవు. కనుక దీపం ఉండగనే చక్క పెట్టుకోవాలి అని పెద్దల వచనం. కనుక శరీరంలో బలం ఉన్నప్పుడే, చేతినిండా సంపాదించుకొంటున్నప్పుడే, ఏ అనారోగ్యం లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులంగా ఉన్న పుడే నిష్కామంగా భగవంతుని ఆరాధించి తరించాలి!

ఇక మనం శ్రీ భగవానుని సేవకు వద్దాం. శ్రీ దత్త భగవానుని వాత్సల్యం అమోఘము. స్వామి అంటున్నారు. "నాయనా! నీవు నన్ను చేరు సాధనలోకి ప్రవేశించి అహర్నిశలు సాధనచేసి ఈ జన్మలో సమయము చాలనిచో నీకు మరల మానవ జన్మనిస్తాను. నేనిచ్చిన ఈ మానవ జన్మను నీవు దుర్వినియోగము చేసి నన్ను చేరుటకు ఉపయోగించుకొననిచో నీకు మరల మానవ జన్మ ఎందుకు ఇవ్వాలి. పాపములు చేసినవారికి నరకబాధలు ఉన్నవి. నేను నరకమును సృష్టించినది, నీ దుర్గుణములను పోగొట్టి నిన్ను సన్మార్గములో నడిపించుటకే గాని నీపై ద్వేషముతో కాదు. అది నా వాత్సల్యమేకాని నీపై కచ్చ కానేకాదు. చేసిన కర్మ ఫలములను అనుభవించక తప్పదని తెలియుము. దానికి ప్రాయశ్చిత్త మార్గమును నీ వాచరించినచో పాపమును రద్దు చేయుదును. మనసా పశ్చాత్తాపపడి, వాచా నా ముందు క్షమాపణ గోరి, కర్మణా దిద్దుకొనుటకు వీలున్న పాపములను దిద్దుకొని మరల వానిని ఆచరించకుండుటయే పశ్చాత్తాపము. మానవుడు పుత్ర వ్యామోహముతో అధిక ధనము నార్జించుచూ, పాపములు చేయుచున్నాడు. తాను మరణించిన తర్వాత ఆ ధనము గాని, ఆ భార్యా పుత్రులుకాని తనవెంట రారు. ఈ స్థూల శరీరముతో పాటు, ఈ లోక బంధము నశించును గాన, నీ పాపములో ఎవ్వరునూ పాలుపంచుకొనరు. కనుక పిచ్చి వాడవైన నీవే మొత్తము పాపపు మూటను నెత్తిన వేసుకొని దాని శిక్షలను నరక లోకమున అనుభవించవలసి యుండును.

కనుక నన్ను ఆరాధించుము. నిష్కామ కర్మ చేయుము. నేను అపార ప్రేమ స్వరూపుడను. నా భక్తులకు కష్టములు కలిగింతునా? నీవు, నిన్నూ, నీ భార్యా పుత్రులను కష్టముల నుండి రక్షించుట లేదని నాపై అలుగుచున్నావు. కానీ, వారి పూర్వ దుష్కర్మలు, నీ పూర్వ దుష్కర్మలూ నాకు తెలియును. నీకు తెలియదు. నన్ను ఉపాసించు వారికి కష్టములు కలుగునని నిందింతురే తప్ప, విచారణ చేయుట లేదు. చూడుము! మీ ఇంటికి వచ్చిన మీ హితాభిలాషియగు బంధువు ఒకడు, మీరు ఎవరెవరికి అప్పుబడియున్నారో, వారి నందరను పిలిపించి, పరిష్కారము చేసి, చాలా భాగము తానే తీర్చి, స్వల్ప భాగమును మిమ్ములను కట్టునట్లు చేయును. ఇక, ఆ అప్పులు శాశ్వత పరిష్కారము జరుపబడి అప్పుడే తీరిపోవుచున్నవి. మీచేత కొంత కట్టించినాడు కాన, అతడు మీకు నష్టము కలిగించిన కష్ట కారకుడా? అయితే, అతడు ఎక్కువభాగము తానే కట్టి మీ ఋణములు తీర్చుట మీకు కని పించుట లేదు కాన, అతడు మీకు నష్టములను కలిగించినట్లు భావింతురు. ఇదే విధముగా నేను, మీ పాప కర్మ ఫలముల నన్నింటిని చాలా భాగము నేనే అనుభవించి, ఛాయా మాత్రముగ నా భక్తులచే అనుభవింప చేయుదును. ఇది తెలుసుకొనవలెను" అన్నారు శ్రీ దత్త భగవానులు. ఎంతటి కృప! ఎంతటి వాత్సల్యము!!

స్వామీ! ఎంత దయాళువువయ్యా! మేము అల్పులము. నీ తత్త్వమును తెలుసుకొనగలమా! తండ్రీ! నీవు త్రిమూర్త్యాత్మకుడవు. నీ కరుణ వలన సర్వము సులభసాధ్యమే తండ్రీ! స్మృతి మాత్ర ప్రసన్నుడవు. నీవు పరమ దయాళువు కనుకనే మా అపచారములను మన్నించి రక్షించుచున్నావు తండ్రీ! పిపీలికాది బ్రహ్మ పర్యంతము శ్రీ దత్తమయమే. భక్తులను కాపాడుట నీకు ఆనందము. నీ పదముల యందు అచంచలమైన భక్తి కలిగి నిన్నే సదా స్మరించుచూ, ఎవరి పనులు వారు చేసుకున్నచో ఎట్టి విఘ్నములుండవని వచించితివి గదా ప్రభూ! తండ్రీ నీవు సత్యము ఈ జగత్తు అసత్యము.మరల ఈ అసత్యములోనే సత్యా సత్యములు కల్పించితివి - నీమాయ అమోఘము. నేను అల్పజ్ఞుడను. నీవు దయా సాగరుడవు. నిన్ను తెలుసుకొనలేనని తెలుసుకున్నవాడే తెలిసినవాడు తండ్రి ! దీనులం చంచలమనస్కులం - మానవమాత్రులం- సంసార లంపటంలో మునిగినవారం-మమ్ముద్ధరింప గలవాడవు నీవే-నీవే-నీవే తప్ప మరియొకడు లేడు. స్వామి అనుగ్రహింపవయ్యా అని ప్రణమిల్లుదము

శ్రీ దత్త ప్రభువులు కరుణామయులు. స్మర్తృగామి. శ్రీ దత్త ప్రభువు చరిత్ర చెప్పేటప్పుడు స్వామియొక్క ప్రధాన భక్తులలో ఒకరైన విష్ణుదత్తుని చరిత్ర స్మరించకపోతే స్వామి సంతోషించరు. కనుక స్వామి తన భక్తుని చరిత్ర ఇక్కడ పలకరించమంటున్నారు. శిరసావహిస్తాను.

మాహూర్ గ్రామంలో విష్ణుదత్తుడనే బ్రహ్మణుడొక డుండేవాడు. సుశీల ఆయన ధర్మపత్ని. ఆమె మహాపతివ్రత. ఆ బ్రాహ్మణ దంపతులు నిత్యం భక్తి శ్రద్ధలతో శ్రీ దత్త భగవానుని ఆరాధించేవారు. నిత్యాగ్ని హోత్రులుకూడా. ఆమె సూర్యభగవానుని ప్రత్యక్ష దైవంగా ఆరాధించేది. రోజూ విష్ణుదత్త సోమయాజి వైశ్యదేవం చేసి బలి అన్నాన్ని ఒక విస్తరిలో పెట్టి వారి ఇంటిముందు వున్న ఒక రావిచెట్టు గట్టుమీద పెట్టేవాడు. ఇలా కొన్నాళ్ళు గడిచాయి. శ్రీ విష్ణు దత్తునకు శ్రీ దత్త ప్రభువును దర్శించాలనే కోరిక దినదినాభి వృద్ధి అవుతోంది. ఒకనాడు ఒక విచిత్రం జరిగింది.

మామూలుగా ప్రతి నిత్యం లాగానే వైశ్యదేవం చేసి ఆ రావిచెట్టు క్రింద గట్టుమీద పెట్టి ఇంట్లోకి వెళుతున్నాడు. రోజూ లాగానే ఆ చెట్టుమీదనున్న కాకి వచ్చి ఆ బల్యాన్నాన్ని ఆరగించింది. అది చూచి తృప్తిపడి రోజూ లాగానే ఆ రోజు కూడా ఇంట్లోకి వెళ్ళబోతున్నాడు. ఇంతలోకే- "విష్ణుదత్తా! ఆగు ఆగు" అని శబ్దం వచ్చింది. వెనక్కి తిరిగి చూచాడు. ఆ చెట్టుక్రిందనున్న కాకి తప్ప మరేమి కనపడలేదు. ఏదో భ్రమ అనుకుని మరల ఇంట్లోకి వెళ్ళబోయాడు. మళ్ళీ కేక వినిపించింది. ఉలిక్కిపడి వెనక్కు తిరిగాడు. ఆ కాకి బ్రహ్మ రాక్షసిగా మారిపోయింది. విష్ణుదత్తుడు తృళ్ళిపడ్డాడు. గుండె ఝల్లుమన్నది. ఒణుకు వచ్చింది. చేతిలోనుండి గోముఖం (నీటి పాత్ర) జారి క్రింద పడింది. ఆ బ్రహ్మరాక్షసుడు ఇదంతా చూశాడు. "విష్ణుదత్తా భయపడకు. నీవు రోజూ పెట్టే బల్యాన్నాన్ని తిని తిని నాకు శాంతి కల్గింది. నీకు కృతజ్ఞత

చెప్పుకోవాలని వచ్చాను. ఏం కావాలో కోరుకో, తెచ్చి ఇస్తాను" అన్నాడు. ఇదంతా ఆ బ్రాహ్మణుని భార్య చూచింది. విష్ణుదత్త సోమయాజి ధర్మపత్నితో సంప్రదించాడు. ఇలా అన్నాడు. "నాయనా! నాకు బహుకాలం నుండి శ్రీ దత్త ప్రభువును దర్శించాలని కోరిక యున్నది. నీకు చాతనైతే దత్త దర్శనం చేయించు. చాలు" అన్నాడు. ఆ మాటలు విన్న బ్రహ్మరాక్షసుడు తృళ్ళిపడ్డాడు. దత్త దర్శనమే! ఆ స్వామి మాట వింటేనే మాకు హడల్. అది నావల్లకాదు. మరేదన్నా కోరుకో" అన్నాడు. అప్పుడు విష్ణుదత్తుడు "నాయనా! నాకేమీవద్దు. నీకు దత్త ప్రభువును దర్శింప చేయటం చేతకాదన్నావు కదా! అయితే వెళ్ళు" అన్నాడు. అందుకు బదులుగా ఆ బ్రహ్మరాక్షసుడు ఇలా అన్నాడు. "ఏం స్వామీ! నన్ను కృతఘ్నుణ్ణి చేయాలనా నీ ఉద్దేశ్యం. వద్దు వద్దు. నీకు మూడే మూడుసార్లు అవకాశం కల్గిస్తాను నీవు ఆ స్వామిని పట్టుకో. అంతే! నేను మాత్రం దూరంగా ఉంటాను సరేనా!" అన్నాడు. వెళ్ళిపోయాడు.

ఒకరోజు హఠాత్తుగా వచ్చాడు బ్రహ్మరాక్షసుడు. తలుపు తట్టాడు. విష్ణుదత్తుడు బయటకు వచ్చాడు. "ఏం నాయనా! వచ్చావు!" అన్నాడు. "విష్ణుదత్తా! రా! దత్త స్వామిని చూపిస్తాను" అన్నాడు. వెంటనే ఇద్దరు బయలుదేరి వెళ్ళారు. అక్కడ ఒక కల్లు దుకాణం, అక్కడ వున్న తాగుబోతును చూపించి "హో! ఆయనే దత్తప్రభువు" అన్నాడు బ్రహ్మరాక్షసుడు. విష్ణుదత్తుడు యజ్ఞం చేసిన సోమయాజి. సద్బ్రాహ్మణుడు. ఈ కల్లు దుకాణమేమిటి, ఈ తాగుబోతు

దత్తస్వామి ఏమిటని నిస్పృహచెంది ఈ బ్రహ్మరాక్షసుని మాటలు విశ్వసించలేక తిరిగి వచ్చాడు. అప్పుడు బ్రహ్మ రాక్షసుడన్నాడు- "ఏం బ్రాహ్మణుడవయ్యా! దురదృష్ట వంతుడివి. స్వామిని చూపించినా గుర్తుపట్టలేకపోయావు. సరే పద. ఇంకో ప్రయత్నం చేద్దాం" అని వెళ్ళిపోయాడు.

ఇలా కొన్నాళ్ళు గడిచాయి. బ్రహ్మరాక్షసుడు మళ్ళా వచ్చాడు. "విష్ణుదత్తా! రా! శ్రీ దత్త ప్రభువును చూపిస్తా" అని వెంటబెట్టుకు వెళ్ళాడు. అది స్మశానవాటిక. అక్కడ ఒక భయంకరుడు, ఒంటినిండా బూడిద పూసుకుని చేతిలో ఎముకలు పట్టుకుని కనిపించాడు. "అడుగో! ఆయనే! పో! ఊ! వెళ్ళు కాళ్ళు పట్టుకో" అని ముందుకు త్రోశాడు. విష్ణు దత్తుడు భయం భయంగా ముందుకు వెళ్ళాడు. ఆ భయం కరుడు చూశాడు. వికటంగా నవ్వాడు. చేతిలోయున్న యముకతో ఒక్క దెబ్బ కొట్టాడు. అంతే బ్రాహ్మణుడు అదిరిపడి వెనక్కు పరుగెత్తాడు. "అయ్యో! అమాయకుడా! రెండవసారికూడా చెడగొట్టుకున్నావు. సరే- ఏం చేస్తాం. నీ దురదృష్టం. ఇంకో ప్రయత్నం చేద్దాం పద" అని బ్రహ్మ రాక్షసుడు అదృశ్యమయ్యాడు. విష్ణుదత్త సోమయాజి జరిగిన దంతా ధర్మపత్నితో చెప్పి తన దురదృష్టానికి వాపోయాడు. తెల్లవార్లు నిద్ర పట్టలేదు. లేచి కూర్చున్నాడు. ఈసారి

ఏమైనాసరే స్వామిని దర్శించవలసిందే అని నిర్ణయానికి వచ్చాడు. తెల్లవారింది.

బ్రహ్మరాక్షసుడు హడావుడిగా వచ్చాడు. "రావయ్యా విష్ణుదత్తా! నీకు శ్రీ దత్త భగవానుని చూపిస్తాను. ఇది మూడో ప్రయత్నం. ఆఖరి ప్రయత్నంకూడా. ఈసారికూడా నీవు స్వామిని చిక్కించుకోపోతే ఇక నావల్లకాదు సుమా" అని హెచ్చరించాడు. విష్ణుదత్తుడు దృఢ నిర్ణయానికి వచ్చాడు. ధర్మపత్ని ధైర్యం చెప్పింది. ఇది ఆఖరి ప్రయత్నం అటో ఇటో తేలిపోవాలని బయలుదేరాడు. శ్రీ దత్త ప్రభువుని మనసారా ధ్యానించాడు. దత్తనామంచేస్తూ బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళాడు. అది రుద్రభూమి. శవాల మాంసం వుంది. చుట్టూ కుక్కలు వున్నాయి. అక్కడ ఒక వికృత పురుషుడు కనిపించాడు. "అదిగో! ఆయనే! పో! కాళ్ళు పట్టుకో!" అని హెచ్చరించాడు బ్రహ్మరాక్షసుడు. సోమయాజి గుండె దిటవు చేసుకున్నాడు. సాక్షాత్తు దత్త ప్రభువే అని భావించాడు. వెళ్ళి రెండు కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు. ఆ వికట పురుషుడు కర్రతో బాదాడు, అయినా వదలలేదు. ఆ దృఢ భక్తికి, అచంచల విశ్వాసానికి శ్రీ దత్త ప్రభువు ప్రసన్నుడై సాక్షాత్కరించాడు. జై గురు దత్త!

"విష్ణుదత్త సోమయాజీ! ఎందుకయ్యా ఇంత కష్ట పడ్డావు" అని ఆదరించాడు. విష్ణుదత్తుని బ్రహ్మానందమునకు అవధులు లేవు. స్వామి పాదాలను ముద్దు పెట్టుకున్నాడు. కాళ్ళు పిసికాడు. పాద రజస్సును శిరస్సున ధరించాడు. కళ్ళ వెంట ధారాపాతంగా వస్తున్న ఆనందబాష్పాలతో స్వామికి పాద ప్రక్షాళన చేశాడు. స్వామి రెండు చేతులతో లేవదీశారు. అనుగ్రహించారు. ఇంతకన్న గొప్ప అదృష్టమేమున్నది. జై గురుదత్త!

స్వామి అన్నారు- "నాయనా! విష్ణుదత్త సోమయాజీ! నీ అచంచల భక్తి, విశ్వాసములకు చాలా సంతోషించాను. కోరుకో! నీకేం కావాలో! ప్రసాదిస్తాను" అన్నారు. విష్ణుదత్త సోమయాజి ఇలా అన్నారు. "స్వామీ! నాకు ఏ కోరికలు లేవు. నీ దర్శన భాగ్యం కల్గింది. ధన్యుడను. ఇంకా నాకింకేం కావాలి. సదా నీ పాదారవిందములపై నా మనస్సు లగ్నమయ్యే టట్లు అనుగ్రహించు తండ్రి. స్వామీ! ఇంకో విషయం. రేపు మా తండ్రిగారి అబ్దీకం. స్వామి భోక్తలుగా విచ్చేసి మా పితృదేవులను అనుగ్రహించాలని నా కోరిక"అన్ని విన్నవించు కున్నాడు. స్వామి–"సరె-ఏర్పాటు చేసుకో"అని అనుగ్రహిం చారు. బ్రహ్మరాక్షసునికి కృతజ్ఞతలు తెల్పుకుంటూ సోమయాజి హుటాహుటి ఇల్లుచేరాడు. జరిగిన వృత్తాంతం

యావత్తు ధర్మపత్నికి తెల్పాడు. ఆమె మహదానందభరితు రాలైంది.

తెల్లవారింది. విష్ణుదత్త సోమయాజి స్నాన, సంధ్యా వందనాలు ముగించుకొని, శ్రార్ధకార్యానికి కావలసినవన్నీ సమకూర్చుకొని స్వామి ఆగమనం కోసం నిరీక్షిస్తున్నాడు. సుశీలమ్మ వంటలో నిమగ్నురాలైంది. స్వామివారు రానే వచ్చారు. దంపతులు స్వామికి అర్ఘ్య పాద్యాదులిచ్చి, ఆశీనుల చేశారు. "స్వామీ! ప్రారంభించనా!" అని అనుజ్ఞ కోరాడు. సోమయాజి, స్వామి నవ్వారు. "ఏమిటయ్యా! రెండవ భోక్తఏడి" అని ప్రశ్నించారు.ఆ ఏకాగ్రభావంలో ఆ సంగతే మరిచాడు సోమయాజి. వెంటనే ధర్మపత్నితో ఈ విషయం చెప్పాడు. అంతే!ఆమె మహా పతివ్రత. "స్వామివారిని స్నానం చేయించండి. రెండవ భోక్తవస్తాడు" అని ధైర్యం చెప్పింది. దొడ్లోకి వెళ్ళింది. సూర్యభగవానుని అర్థించింది. అంతే సూర్య భగవానుడు అనుగ్రహించాడు. రెండవ భోక్తగా విచ్చేశాడు. మరి మూడవ భోక్తయో! సాక్షాత్తు అగ్నిహోత్రుడే విచ్చేశాడు. శ్రార్ధకర్మ చక్కగా జరిగింది. స్వామి చాలా సంతోషించారు. తన స్వస్వరూపంలో సాక్షాత్కరించారు. విష్ణుదత్త సోమయాజి వారి సతీమణి సుశీలమ్మ బ్రహ్మానందభరితులయ్యారు. స్వామి అన్నారు. "పుణ్యదంపతులారా! మీ భక్తి ప్రపత్తులకు

ప్రసన్నుడనై నాను. వరం ప్రసాదిస్తాను. కోరుకొండి" అని. తమకు ఈ అదృష్టం కలుగుటకు కారణ భూతుడైన బ్రహ్మ రాక్షసుని ఉద్ధరించమని ప్రార్థించారు. స్వామి ఇలా అన్నారు. "నాయనా! బ్రహ్మరాక్షసుడు అనుగ్రహించబడ్డాడు. ఇంకో వరం కోరుకో" అన్నారు. "స్వామి—మాకు ఏ కోరిక లేదు" అన్నారు ఆదంపతులు. స్వామి నవ్వారు."పుణ్యాదంపతులారా మీ నిష్కామ కర్మకు, నిస్వార్థతకు ఆనందించాను. నేనేవరం ప్రసాదిస్తాను."అని స్వామి షోడశాక్షరీ మంత్ర రాజాన్ని విష్ణు దత్తునికి ఉపదేశించారు.సూర్యభగవానుడు, అగ్ని హోత్రుడు సంతుష్టులై అదృశ్యులైనారు. స్వామి అనుగ్రహంవల్ల విష్ణు దత్తుని పితృదేవతలు సద్గతిపొందారు. విష్ణుదత్తుడు ధర్మపత్ని సుశీలమ్మ స్వామిని సేవించి ముక్తులయ్యారు. ఇట్లే కార్త వీర్యార్జునుడు శ్రీదత్త ప్రభువులను ఆరాధించి కృతార్థుడై నాడు.

శ్రీ దత్తాత్రేయస్వామి పరబ్రహ్మము వారు కలియుగ మున ప్రథమముగా అవతరించిన శ్రీ పాద శ్రీవల్లభుల చరిత్ర నాకు స్వామి వాక్కు అనుగ్రహించిన మేరకు వచించి తరిస్తాను.

శ్రీగణేశాయనమః శ్రీ సరస్వత్యైనమః

శ్రీ గురుదత్తాత్రేయాయనమః

# దత్తావతారులు

## శ్రీ పాద శ్రీ వల్లభులు

శ్లో॥ కృతే జనార్దనోదేవో, త్రేతాయాం రఘునందనః
ద్వాపరే రామకృష్ణశ్చ, కలౌ శ్రీపాద శ్రీవల్లభః

కృతయుగంలో జనార్దనుడుగను, త్రేతాయుగంలో శ్రీరాముడుగను, ద్వాపరయుగములో శ్రీ కృష్ణభగవానుడుగను, కలియుగంలో శ్రీపాద శ్రీవల్లభుడుగను పరబ్రహ్మము అవతరించినట్లు భవిష్యోత్తర పురాణం చెప్పుచున్నదని పెద్దల వల్ల తెలుసుకున్నాం. అయితే, ఈ పరబ్రహ్మమెవరు?

వేదములో ఇట్లు చెప్పబడియున్నది.

"ఏకమేవ అద్వితీయం బ్రహ్మ"

"యతోవా ఇమాని భూతాని ၊ జాయన్తేయేన జాతాని
జీవన్తియత్ప్రయన్త్యభిసం విశన్తి" [శ్రుతి]

అనగా బ్రహ్మము ఒక్కటే రెండవదిలేదు. ఆ బ్రహ్మమే సృష్టి, స్థితిలయములను మూడు కార్యములను చేయుచున్నది. అని వేదములు చెప్పుచున్నవి. అత్రి అనసూయలకు దర్శనమిచ్చిన ఆ త్రిముఖ, షడ్భుజరూపము శ్రీదత్త భగవానుడే వేదములచే చెప్పబడిన ఆ పరబ్రహ్మము. ధర్మమును ఉద్ధరించుటకు, అధర్మమును దండించుటకు పరబ్రహ్మము అవతరించుచున్నది. పరబ్రహ్మము ఏ ప్రాణినైనా ఆవేశించినప్పుడు అది ఆ వేశావతారమందురు. ఆ ఆ వేశావతారము ద్వారా ధర్మస్థాపన అధర్మ నాశనమును చేసి, ఆ కార్యము పూర్తి కాగానే ఆవేశము తొలగిపోవును. అప్పుడు. ఆప్రాణి మరల తన పూర్వరూపమున ఉండును.

ఉ॥దా॥ పరశురామ అవతారము. పరశురాముడు ఒక మహర్షి. క్షత్రియ సంహారార్థము పరబ్రహ్మము ఆయనలో ఆవహించెను. ఆపని పూర్తి కాగానే ఆ ఆవేశము తొలగిపోగా ఆయన మామూలు మహర్షియైనాడు. ఒక జీవునిలో పర బ్రహ్మము యొక్క అంశ ప్రవేశించగా అంశవతార మనబడును. ఒక కళ ప్రవేశించిన కళావతారమనబడును. ద్వాదశ కళలతో అవతరించినది రామావతారము. ఇది పూర్ణావతారము. షోడశకళలతో ఆవిర్భవించినది శ్రీకృష్ణావ తారము. ఇది పరిపూర్ణవతారము. శ్రీదత్త పరబ్రహ్మము ఈ కలియుగమున అవతరించిన అవతారములలో ప్రథమము శ్రీ పాద శ్రీవల్లభులు. వీరి చరిత్రను తెలుసుకొందము.

మన ఆంధ్రదేశమున పవిత్ర గోదావరి తీరప్రాంతములో పిఠాపురము అనే గ్రామమున్నది. ఇది తూర్పు గోదావరి జిల్లాలోయున్నది. 14వ శతాబ్దంలో జరిగిన మహాద్భుతం. ఆ కాలంలో పిఠాపురము గ్రామములో పరమ వైదికుడైన అప్పళరాజ శర్మ అనే బ్రాహ్మణోత్తము డుండెడివాడు. ఆయన సతీమణి పరమ పతివ్రత. ఆమెయే సుమతి. వారు శ్రీదత్త భగవానుని పరమ విశ్వాసంతో, అచంచల భక్తి ప్రపత్తులతో ఆరాధించేవారు. వారి సద్గుణ కీర్తి చంద్రికలు వాడవాడలా కీర్తింపబడుచుండెను. వారు ప్రతి నిత్యము అతిథి పూజచేసి ఆ అతిథిని సాక్షాత్తు శ్రీదత్తభగవానునిగా భావించి సత్కరించుచుండెడివారు. ఇట్లుండగా ఒక దినమున వారింట శ్రార్ధముపెట్టు కొనవలసిన తిథి వచ్చెను. శ్రార్ధదినమున బ్రాహ్మణులు భోజనము ముగించకముందు, మరి ఎవ్వరికి

భోజనము పెట్టరాదని ఆచారముగలదు. కనుక ఆ రోజు చాలా శ్రద్ధగా ఆ దంపతులు శ్రార్ధ కార్యమును నిర్వహించు చుండిరి. తద్దినము పెట్టుటకు ఆహ్వానితులైన భోక్తలు వచ్చి యుండిరి. అప్పలరాజుశర్మ శ్రార్దకార్యమున నిమగ్నుడై యుండెను. ఆయన సతీమణి సుమతి వంట ఇంటిలో వంట చేయుచుండెను. ఇంతలో ఒక విచిత్రము జరిగెను. దొడ్డి వాకిలి నుండి వారింటికి దండము, కమండలము ధరించిన ఒక సన్యాసి లోపలికి వచ్చెను. సుమతి దేవితో ఆ సన్యాసి భిక్షాందేహియనెను. ఆమె ఆశ్చర్య చకితురాలైయ్యెను. మధ్య ఇంటిలో శ్రార్థకలాపములో నిమగ్నుడైన ఆమె భర్తకు ఈ విషయము తెలియదయ్యెను. శ్రాద్ధభోక్తలు భుజించకమునుపు ఎవరికి భిక్ష ఇవ్వరాదని శాస్త్రము కదా. ఆమె ధర్మ సంకట మున పడెను. ధర్మము గొప్పదా? పరబ్రహ్మము గొప్పదా? అని ఆమె హృదయమున తర్కించెను. ఏ పరమేశ్వరుని కృప కొరకు ఈ శ్రార్ధము ఆచరించబడుచున్నదో, ఆ పరబ్రహ్మమే సాక్షాత్తు భిక్షకువేతెంచినపుడు ధర్మమైననూ అతిక్రమించ వచ్చునను జ్ఞానము ఆమె హృదయములో తళుక్కుమనెను. వెంటనే ఆమె ఆ యతీశ్వరుని సాక్షాత్తు తమ ఆరాధ్యదైవమైన శ్రీ దత్త ప్రభువుగా భావించి, శ్రార్థభోక్తలకు వడ్డించక మునుపే, ఆ యతీశ్వరునకు భిక్ష ఇచ్చెను. ఆ యతీంద్రుడు, ధర్మముకంటె తనకే అధిక్యతను ఇచ్చి పరిపూర్ణవిశ్వాసముతో భిక్ష ఇడిన ఆ సాధ్వి సుమతికి శ్రీ దత్త భగవానునిగా దర్శన మిచ్చెను. సుమతీదేవి పూజలు ఫలించెను. శ్రీ దత్త భగవానుడు త్రిముఖ, షడ్భుజములతో సాక్షాత్కరించెను. బ్రహ్మ, విష్ణు, శివ ముఖములు. శంఖ చక్రములు, ఢమరు, త్రిశూలములు,

కమండల అక్షమాలలతో దర్శన మిచ్చెను. స్వామి పీతాంబర ధారిగా, కాషాయ మేఖలతో, వనమాల ధరించి, స్ఫటిక, తులసి, రుద్రాక్షమాలధారియై, పాదముల కడ చతుర్వేదములు నాలుగు శునకములుగా సేవించుచుండగా, యమధర్మరాజే ధర్మ ధేనువై స్వామిని ఆశ్రయించి యుండగా, ఆజాను బాహువై కోటి సూర్యచంద్ర కళలతో మెరసిపోవుచు దేదీప్య మానముగా ఆమెకు దర్శన మొసగెను. ఆమె అదృష్టమే అదృష్టము. ఆమె తన నయనానందముగా స్వామి రూపమును పానము చేయుచుండెను. తన్మయత్వము నొందెను. ఇంతలో స్వామి ఇట్లు వచించెను. "తల్లీ! నీ భక్తికి సంతుష్టుడనైనాను. ధర్మమును కూడా, నా కొరకు త్యజించి శ్రాద్ధభోక్తలకు ముందుగా నాకు భిక్ష నిడినావు. ధన్యురాలవు. వరము కోరు కొమ్ము. అనుగ్రహించెదను" అని పలికిరి. ఆమె సంతోష ముతో ఆనందభాష్పముల రాల్చుతూ, ఇట్లు విన్నవించెను. "ప్రభూ! కోటి సూర్య ప్రభాభాసితుడవు. యుగ యుగములు కఠోర తపో దీక్ష కల్గినవారికే లభించినవాడవు ఈ అబలకు కరుణించి దర్శన మిచ్చావు. నేను ధన్యురాలను. మమ్ము, మా పితృదేవతలను అనుగ్రహించావు. ఇంతకంటే మాకు కావలసిన దేమున్నది. నన్ను తల్లీ! అని సంబోధించావుకదా! కనుక నీవే నా బిడ్డవు అగునట్లు అనుగ్రహించుమని" ప్రార్థిం చెను. ప్రభువు కరుణా సముద్రుడు. భోగమోక్షప్రదుడు. ఆమె విన్నపమునకు ఆనందించెను. స్వామి ఇట్లనెను. "తల్లీ! నాతో సమునైన పుత్రుని అనుగ్రహిస్తున్నాను. కాని ఒక విషయం విస్మరించరాదు. పుత్రునిపైగల పుత్ర వ్యామోహంలో పడక, పుత్రుడు జన్మించిన తర్వాత ఆ పుత్రుడు చెప్పినట్లు మీరు

చేయాలి" అని సెలవిచ్చారు. అప్పుడు ఆమె మరలా ఇలా విన్నవించుకున్నది. "ప్రభూ! నేను తల్లినిగదా. మాతృమూర్తినిగదా. పుత్రవ్యామోహము సహజముగదా! అబలను కదా! కనుక నీవే నాపై అనుగ్రహంతో నీవు చెప్పినట్లు ఆచరించగల బలాన్ని అనుగ్రహించు" అని వేడుకున్నది. స్వామి చిరునవ్వుతో ఆమెను అనుగ్రహించి, అంతర్ధానమైనారు.

సుమతీదేవికి ఆ ఆశ్చర్యస్థితి నుండి తేరుకోవటానికి నిముష కాలం పట్టింది. ఆమె వెంటనే లోనికివెళ్ళి తన భర్తను ఒకసారి రండని పిలచింది. అప్పలరాజుశర్మ ఆమె ముఖంలోని పరమానందాన్ని చూచి చకితుడై వంట ఇంటిలోనికి వచ్చి ఏమిటి? ఏమైంది? అని గాబరాపడుతూ ప్రశ్నించాడు. ఆమె తన భర్త పాదాలమీద వ్రాలింది. స్వామీ! నావల్ల ఒక అపరాధం జరిగింది. శ్రార్ధభోక్తలు భుజించక మునుపే, పెరటివాకిటనుండి ఒక యతీశ్వరుడు వచ్చాడు. భిక్షాందేహి యని భిక్ష కోరాడు. ఆయనను చూడగనే నాకు సాక్షాత్తు మన ఆరాధ్య దైవమైన శ్రీ దత్త ప్రభువులే అని భావన కల్గింది. వెంటనే భిక్ష పెట్టాను. ఆ యతీశ్వరుడు సంతసించి వెంటనే తన నిజ స్వరూపమైన శ్రీ దత్తమూర్తిగా సాక్షాత్కరించారు. తల్లీ! అని నన్ను సంభోధించారు. వరం కోరుకోమన్నారు. అప్పుడు నేను తనవంటి పుత్రుని ప్రసాదించమని కోరాను. ఆయన తధాస్తు అని అనుగ్రహించారు" అని కంటికి ధారగా ఆనందభాష్పాలు రాలుస్తు విన్నవించింది. వింటూనే, అప్పలరాజు శర్మకు భావావేశము కలిగినది. ఆమె చెప్పిన ప్రతిమాట ఆయనకు భావాలోకంలో స్పష్టంగా గోచరించినది. ఆయన

కళ్ళు చమర్చాయి. ఆమెను సున్నితంగా పైకి లేవనెత్తి "సాధ్వీ! నీవు పతివ్రతవు ధన్యురాలవు. నీవు చేసిన కార్యము ఆక్షేపింపవలసినది కాదు. ధన్యురాలవు. మనపితృదేవతలు తరించారు. సాక్షాత్తు పరబ్రహ్మ స్వయంగా భిక్ష స్వీకరించారు. మనమిరువురము ధన్యులమే. పైగా తన వంటివాడు మరియొకరు లేరు కాన తానే మనకు పుత్రునిగా జన్మిస్తానని వరప్రదానం చేశారుగదా. ఇంతకన్నా అదృష్టం ఉన్నదా. అత్రి అనసూయలకు అనుగ్రహించినట్లు, మనకు స్వామి అనుగ్రహం కల్గింది" అని ఆమెను ఓదార్చి, ప్రశంసించి, మిగిలిన శ్రార్ధకార్యాన్ని నిర్వర్తించారు.

ఇట్లు కొన్నాళ్ళు గడిచింది. సుమతి గర్భవతి అయినది. గర్భస్త శిశువు దినదినాభివృద్ధి చెందుతున్నాడు. శ్రీ అప్పలరాజు శర్మ ఆమెకు సకాలంలో పుంసవనాది కార్యక్రమము జరిపించాడు. ఆమె శ్రీ దత్త భగవానుని హృదయంలో నిల్పి భజిస్తూ ఉండేది. శ్రీ దత్త నామం ఉచ్చరిస్తూ గృహకృత్యాలు నిర్వర్తిస్తూ ఉండేది. ఇట్లుండగా భాద్రపద శుక్లచవితినాడు సుముహూర్తంలో ఆమెకు మగశిశువు ఉదయించాడు. ఆ బాలుడు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. జ్యోతిష్కులను రావించి, జాతకచక్రం వేయించాడు అప్పలరాజుశర్మ. అమోఘమైన జాతకము. సాక్షాత్తు భగవంతుని అంశయే అన్నారు జ్యోతిష్కులు. అప్పలరాజుశర్మ సుమతి పుణ్యదంపతుల ఆనందానికి అవధిలేదు. బాలునికి "శ్రీపాదుడు" అని నామకరణంచేసి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. బాలుడు ఎనిమిది సంవత్సరముల ప్రాయంగలవాడైనాడు.

బాలచేష్టలు తల్లి దండ్రులను ఆనంద సాగరంలో ఓలలాడిస్తు న్నాయి. ఎనిమిదవయేట యథావిధిగా ఉపనయనం చేశారు. గాయత్రి మంత్రోపదేశము చేయగనే శ్రీపాదుడు విజృంభిం చాడు. వేదములను ధారాళంగా వల్లిస్తున్నాడు. తాను శ్రీ దత్త భగవానునే మరియొకటి కాదని నిరూపించుచున్నాడా! అన్నట్లుండెను. రాను రాను శిష్యులకు వేద పాఠములు చెప్ప ప్రారంభించెను. సర్వ శాస్త్రముల ప్రావీణ్యత ఋజువు చేయుచూ, అందరిని ఆశ్చర్యపరచుచూ షోడశ వర్షప్రాయు డైయ్యెను. 16 సం॥ వయస్సు వచ్చినది. ఇక మనవానికి వివాహం చేయాలి అని అప్పలరాజు శర్మ భార్యతో అనెను. ప్రక్కనే యున్న శ్రీపాదుడు తల్లితండ్రుల వద్దకు వచ్చి నమస్కరించి ఇట్లన్నాడు. "తండ్రీ! మీరు అమ్మతో చెప్పి విషయం గ్రహించాను. మీరు నాకు కన్యను వెదకనవసరం లేదు. నేను కన్యను వెదకి సిద్ధంగానే ఉంచాను. ఆమెయే యోగశ్రీ. నేను యోగశ్రీని చేపట్టి సన్యాసినౌతాను" అని తన నిశ్చయాన్ని తెలిపాడు.

అప్పటివరకు ఆనంద డోలికలలో పరవశించియున్న తల్లితండ్రులు నిశ్చేష్టులై, కంటతడి పెట్టారు. "నాయనా! ఇది నీకు తగునా! నీవు వివాహమాడి గృహస్థాశ్రమ ధర్మము గడిపి, మమ్ము ఉద్ధరింతువని మేము కన్న కలలన్ని వ్యర్థమేనా! తండ్రి! మా మాట కాదనకు. చూడు మీ ఇరువురు సోదరులను ఒకడు కుంటివాడు. రెండవవాడు గుడ్డివాడు. నీవు సన్యసిస్తే, మా గతి ఏమిటి?" అని విలపించారు. శ్రీపాదుడు తల్లితండ్రుల కంటినీరు తుడిచాడు. "అమ్మా! విలపించకు. తండ్రీ దుఃఖించకు"

అని చెప్పి తన సోదరుల నిరువురను దగ్గరకు తీసుకొని తన అమృత హస్తంతో వారిని తాకాడు. వెంటనే వారిరువురు సుందరమైన వారై, వారి కుంటి, గ్రుడ్డితనములు పరిహరింపగా చక్కనివారై కనుపించారు. శ్రీ దత్త పరబ్రహ్మమునకు సాధ్యా సాధ్యాలున్నవా? సంకల్ప మాత్రంచేతనే సృష్టి, స్థితి, లయముల చేయు ప్రభువుగదా!

ఇదంతయూ, ప్రత్యక్షముగా కన్నులారా చూచారు అప్పలరాజు శర్మ, సుమతి పుణ్య దంపతులు. ఆమెకు తళుక్కుమని జ్ఞానోదయమైనది. ఆనాడు యతీశ్వరుడు పుత్ర భిక్షను అనుగ్రహించి చెప్పిన వాక్యములు జ్ఞాపకము వచ్చినవి. శ్రీపాదుడు సాక్షాత్తు శ్రీ దత్త ప్రభువనే జ్ఞానం స్ఫుటంగా గోచరించింది. అప్పుడు ఆమె ఇట్లన్నది. "స్వామీ! నిన్ను తెలుసుకున్నాను. పుత్ర రూపంలో సాక్షాత్కరించిన భగవానుడవు. నీ మాయా ప్రభావం చేత పుత్ర వ్యామోహంలో పడి ఇన్నాళ్ళు తెలుసుకోలేకపోయినాను. నీవు సాక్షాత్తు మా ఆరాధ్య దైవమైన శ్రీ దత్త భగవానుడవే. నేను ఆనాడే నిన్ను కోరాను. ఈ పుత్ర మోహంనుండి నన్ను ఉద్ధరించ వలసిన వాడవు నీవే గదా!" అని విన్నవించింది. ఎంత అద్భుతం. శ్రీపాదుడు తన నిజ స్వరూపాన్ని తల్లికి మరొక్కసారి చూపించారు. ఆ సుందర సుకుమార తేజపుంజ, సుగంధ స్వరూపం వర్ణించటానికి వేయి నాలుకలు గల ఆదిశేషునికి కూడా సాధ్యంకాదు. అప్పుడు శ్రీపాదుడు తల్లితో ఇట్లా అన్నాడు. "అమ్మా! ఇప్పుడు నీవు దర్శించిన నా రూపాన్ని ధ్యానించు. నీకు భవబంధ విముక్తి కలిగి మోక్ష సామ్రాజ్యాన్ని

చేరుకుంటారు. ఈ సోదరులిరువురు మిమ్ము సేవించి కృతార్థు లౌతారు" అని వచించారు. వెంటనే తన సోదరులవైపు చూచి, "సోదరులారా! మన తల్లిదండ్రులను సేవించి తరించండని" అని వచించారు.

ఇట్లు అని, తల్లిదండ్రులకు నమస్కరించి, వారి అనుజ్ఞ గైకొని సన్యసించి విశాల ప్రపంచంలో అడుగుపెట్టారు. శ్రీ శ్రీపాద శ్రీ వల్లభస్వామి బయలుదేరి వెళ్లుచూ కాశీ, బృందా వనము, ద్వారక మధుర, బదరీ క్షేత్రములు దర్శించారు. ఆ తర్వాతే శ్రీపాదస్వామి గోకర్ణ క్షేత్రము చేరారు. గోకర్ణ క్షేత్రంలో వెలసియున్న మహా బలేశ్వరుని సన్నిధిలో కొన్నాళ్లు ఉన్నాడు. అక్కడి గణేశ్వరుని సేవించుకున్నారు. తరువాత కృష్ణా తీరంలోని శ్రీశైలం చేరి అక్కడ నాలుగు మాసములుండి ఆ తర్వాత కురుపురం చేరారు. కురుపురం లోనే శ్రీపాద స్వామివారు తన స్థూల శరీరాన్ని త్యజించారు.
శ్రీపాద శ్రీ వల్లభులు సాక్షాత్తు శ్రీ దత్త భగవానుని ప్రథమావతారమని చెప్పుకున్నాము గదా. వారి లీలలు, మహాత్త్యములు కూడా తెలుసుకొని తరించెదము గాక!

కురుపురంలో ఒక విచిత్రం జరిగింది.ఆ గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబం ఉన్నది. ఆ దంపతులకు లేకలేక ఒక పుత్రుడు జన్మించాడు. ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు. కాని వారి ఆనందం ఎక్కువకాలం నిలువలేదు. ఆ బాలుడు బుద్ధిహీనుడు, తెలివితక్కువ వాడైనాడు. బాలునికి 8 సంవత్సరముల ప్రాయము రాగానే తండ్రి ఉపనయనం చేశాడు. దురదృష్టం. ఆ బాలుడు గాయత్రి మంత్రాన్నికూడ

చక్కగా ఉచ్ఛరించలేకపోయాడు. తండ్రి ఆ పిల్లవానికి చదువు చెప్పి చెప్పి విసిగి వేసారిపోయాడు. కోపం తట్టుకోలేక పిల్లవానిని కొట్టేవాడు. తల్లి భరించలేకపోయేది. అడ్డం పడేది. తన భార్య విచారాన్ని భర్త భరించలేకపోయాడు. ఈ బాలుడు నిరర్థకుడు, మూర్ఖుడు అని నిరాశ చెంది తండ్రి దిగులుపడి మరణించాడు. భర్త స్వర్గస్థులైన తర్వాత ఆ తల్లి బిడ్డలకు భోజనానికి కూడ కరువైంది. చేసేదిలేక వారు భిక్షాటనం చేసి పొట్ట పోసుకునేవారు ఇట్లు కొన్నాళ్ళు గడిచింది. పిల్లవాడు పెద్దవాడు అగుచున్నాడే కాని, వాని బుద్ధి వికసించలేదు. రోజు భిక్షాటనకు వెళ్లుతుంటే, ఊళ్ళో వాళ్ళు "ఏమిటిరా! మూర్ఖుడా. తండ్రికి చెడపుట్టావు. చదువు సంధ్యాలేదు. దున్నపోతులాగా పెరుగుతున్నావు. ఎందుకు ఈ బ్రతుకు. ఇలా బ్రతికేకన్న కృష్ణానదిలో పడి చావరాదా? అని పలువిధముల రోజూ దూషించుచుండిరి. ఆ పిల్లవాడు ఆ దూషణములను, అవమానములను భరించలేక, నిజంగా కృష్ణానదిలో దూకి ప్రాణత్యాగము చేయుటయే మంచిదని తలచి కృష్ణానదివైపుకు పరుగిడ మొదలిడెను. ఇది అంతా చూచుచున్న ఆ బాలుని తల్లి నిస్సహాయురాలై, ఏమియు చేయలేక తానుగూడా ఆ బాలుని వెంట పరిగెత్తుతూ ఆర్తనాదముతో "నాయనా! ఆగు ఆగు. ఆత్మహత్య మహాపాపము" అని అరచుచూ, నాయనాలారా ఆ పుత్రుని రక్షించండి రక్షించండి అని దీనాలాపము లాడుచూ పరుగిడుచుండెను. ఇంతలో కృష్ణానది నుండి స్నానమాడి తిరిగి వచ్చుచున్న శ్రీపాద శ్రీ వల్లభ స్వామివారు ఆ బాలునికి ఎదురు వచ్చుచూ, ఆ బాలుని ఆపి "నాయనా! ఆగు-ఆగు-ఆత్మహత్య మహాపాపము. పూర్వ

జన్మల దుష్కర్మల వల్ల ఈ జన్మలో నీకు ఈ కష్టములు కలిగినవి. ఇప్పుడు నీవు ఆత్మహత్య చేసుకొనినచో మహాపాపము చుట్టుకొని వచ్చే జన్మలో ఇంతకంటే దారుణమైన కష్టములు ననుభవించవలసి వచ్చును. కనుక ఈ దారిద్ర్యమును, దుష్కర్మ ఫలమును పోగొట్టుకొనుటకు ఓరిమితో ప్రయత్నించుము" అని బాలుని వారించిరి. ఇంతలో ఆ బాలుని తల్లి కూడ వచ్చి చేరెను. ఆమె స్వామివారి పాదములపైబడి "స్వామీ! రక్షించుము! రక్షించుము. మమ్మనుగ్రహించుము తెలిసియో తెలియకయో ఎన్నో దుష్కర్మలను చేసితిమి. ఇప్పుడు ఆ పాప ఫలమును అనుభవించుచున్నాము. నీవు సాక్షాత్తు భగవానుడవు, నీవు తప్ప మాకెవ్వరు దిక్కు. రక్షించుము" అని విలపించదొడగెను. స్వామి ఆ తల్లిని ఊరడించి, "అమ్మా! ఆత్మహత్య మహాపాపము. నీవు ఈ జన్మలోనే ఉద్ధరించుకొనుటకు ప్రయత్నించుము. నీవు నీ శేష జీవితము శివపూజలో యుండుము. ఇలా చేసినచో వచ్చే జన్మలో మంచి పుత్రుని పొందెదవు" అని వచించెను. అప్పుడు ఆ స్త్రీ శ్రీ వారితో ఇట్లు విన్నవించుకొనెను. "స్వామీ! ఇప్పుడు శివపూజ చేసినచో వచ్చే జన్మలో కదా నాకు సుపుత్రుడు కలిగేది. మరి ఈ జన్మలో ఈ మూర్ఖ బాలునితో నేను ఎట్లు శాంతితో యుండగలను. కనుక నన్ను, నా బాలుని అనుగ్రహించుమని కాళ్ళవేళ్ళ బడెను. ఆమె రోదించుచుండెను. శ్రీ పాద శ్రీవల్లభులు సాక్షాత్తు దత్త భగవానులే కదా! వారు సర్వశక్తి సంపన్నులు. వారికి సాధ్యాసాధ్యములులేవు. వారు కరుణార్ద్ర హృదయులు. ఆ తల్లి విషాదమును బాప సంకల్పించిరి. ఆ బాలుని శీర్షముపై తన హస్తమును ఉంచి ఓంకారము చేసిరి.

వెంటనే ఆ బాలుడు వేదవేదాంగ పారంగతుడయ్యెను. ఆ బాలుడు శ్రీ గురుని అనేక విధములుగా స్తుతించెను. ఆ తల్లి ఆనందమునకు అవధులు లేవు. ఆమె స్వామి పాదములపైబడి ఆనంద భాష్పములతో శ్రీ వారి పాద ప్రక్షాళన చేసెను. శ్రీ ప్రభువులు ఆమెకు మరు జన్మలో తనతో సమానుడైన పుత్రుడు కల్గునని ఆశీర్వదించి ఆశ్రమమునకు వెడలిపోయెను. ఆమెయు తన శేష జీవితమును శివపూజలో గడిపి దేహ త్యాగము చేసెను.

ఇట్లుండగా మరియొక విచిత్రము జరిగెను. శ్రీ గురుని మహిమలకు ఒక హద్దు నిర్ణయించుట ఎవరి తరము శ్రీ పాద శ్రీ వల్లభులు కొంతకాలము కురుపురంలో ఉండిరిగదా. ఆ కాలములో ఒక అద్భుతము జరిగెను. ఒక రజకుడు ప్రతిరోజు స్వామివారి ఆశ్రమమును శుభ్రపరచుచూ, స్వామివారికి దండ ప్రణాములు చేయుచుండెను. ఒకనాడు శ్రీ గురుడు వానిని చూచి "ఓరీ! నీవు రాజ్యాన్ని పాలిస్తావురా!" అనిరి. వాడు ఆశ్చర్యపోయెను. ఇట్లు కొన్నాళ్లు వాడు స్వామిని విడువక సేవచేయుచుండెను. ఒకనాడు ఆ రజకుడు నదిలో వస్త్రము లను ఉతుకుకొనుచుండగా, ఒక రాజుగారు తన భార్యా, పరివారముతోవచ్చి ఆ నదిలో జలకములాడుచుండెను. ఆ దృశ్యము చూచి ఆ రజకుడు ఇట్లు తలపోసెను. "ఆ రాజుగారి అదృష్టము ఎంత గొప్పగా యున్నది. వారి గురువుగారు ఎంతటి మహానుభావులోగదా! నేనెంత. నాకు అట్టి అదృష్టం కలగటం కల్ల" అని నిట్టూర్చి ఆ ఉతికిన బట్టలను తీసుకొని ఆశ్రమమునకు వచ్చెను. శ్రీ గురుడు వానిని చూడగనే "ఓరీ రజకసేవకా! ఎందుకురా దిగులు పడతావు. నీవు తప్పక

రాజువవుతావు. ఇది సత్యం. ఈ జన్మలోనే నీవు రాజువైనచో ఈ వృద్ధాప్యంలో ఏమి సుఖమునను భవించగలవు. కనుక వచ్చే జన్మలో రాజువు అవుతావు. అయితే నీవు బీదరులో ముస ల్మాను సుల్తానువు అవుతావు" అని పలికిరి. అప్పటివరకు ఉత్సాహంగాయున్న ఆ రజకుడు ఉలిక్కిపడి "స్వామీ! అదేమి. నన్ను నీకు దూరం చేస్తావా! స్వామీ! నన్ననుగ్ర హించు" అని వేడుకున్నాడు. శ్రీ పాదులు మందస్మిత వద నారవిందులై ఇట్లు అనుగ్రహించారు. "నాయనా! భయపడకు. నీ శ్రద్ధాభక్తులకు ప్రసన్నుడనైనాను. నీవు మహమ్మదీయుడి విగా జన్మించి సుల్తానువైననూ, నాయందు నీకు భక్తి విశ్వా సములుంటాయి. నీకు వృద్ధాప్యములో నేను శ్రీ నరశింహ సరస్వతి అవతారము దాల్చి నిన్ను అనుగ్రహిస్తాను" అని ఆశీర్వదించారు. ఆ రజక సేవకుడు శ్రీ గురుని భక్తిశ్రద్ధలతో జీవించి ఉన్నంతకాలము సేవించి పరమ పదించాడు.

కొంతకాలం గడిచినది. శ్రీ పాద శ్రీ వల్లభులు కురు పురంలోనే ఉన్నారు. ఒకానొక సమయంలో శ్రీ పాదులు ఈ విధంగా సంకల్పించారు. నేను వచ్చిన కార్యం పూర్తయింది. నా ఈ స్థూలదేహాన్ని గుప్తపరచవలసిన సమయం ఆసన్న మైనది. ఆ బ్రాహ్మణికి ఇచ్చిన మాట ప్రకారం నేను ఆమెకు వచ్చే జన్మలో పుత్రునిగా జన్మించవలసియున్నది అనుకొని ఆశ్వయుజ బహుళంలో హస్త నక్షత్రం ద్వాదశి నాడు శ్రీ పాద శ్రీ వల్లభులు పవిత్ర కృష్ణానదిలో కురుపురంలో తన స్థూలకాయాన్ని గుప్తం చేశారు. అయినప్పటికి శ్రీ దత్త అవతారులు కనుక సూక్ష్మరూపంలో అనేక మహిమలు చేశారు. ఇంకా ఇప్పుడూ చేస్తూనే ఉన్నారు.

శ్రీ వారి మహిమలను మనం కూడా నెమరు వేసుకుని తరిద్దాం.

శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి దత్త సాక్షాత్కారాన్ని పొందిన మహనీయులు. వారు ఒక చాతుర్మాస్య వ్రతాన్ని కురుపురంలో నిర్వహించారు. శ్రీ వాసుదేవానందులు అమిత ఆచార పరులగుటచేత అక్కడవారికి సరియైన శ్రోతియులైనవారి భిక్ష లభించలేదు. కురుపురంలో ముగ్గురు సోదరులు ఉండేవారు. వారు పూజారులే. కాని వారి భార్యలు మత్స్యకారుల కుటుంబాలకు చెందినవారే కనుక శ్రోత్రీయ కుటుంబం వారు ఎవరూ లేరు. అందువలన శ్రీ వాసుదేవానందులు వారినుండి భిక్ష స్వీకరించలేదు. ఆ కారణంచేత వారు మూడురోజులు ఉపవాసము చేసిరి. మూడవనాటి రాత్రి వారికి శ్రీపాద శ్రీవల్లభులు స్వప్నదర్శనమిచ్చి ఇలా అన్నారు. "నే నెటువంటి భిక్షనైనా స్వీకరిస్తాను. కాని నీవు భిక్ష తీసుకొనకుండా ఆచారము పాటిస్తూ మూడురోజులు ఉపవాసము చేశావు. నా ప్రీతికోసమైనా సరే! అంతటి కఠోర ఆచారాన్ని పాటించదలిస్తే నీవీ క్షేత్రంనుండి వెళ్ళిపో" అని ఆజ్ఞాపించారు. మరునాడు శ్రీవాసుదేవానందులు అందులో శేఖర్‌భట్టు అనువానిని వాని భార్యను పిలచి ఈనాటి నుండి మీ భిక్ష స్వీకరిస్తాను అని చెప్పి అట్లు చేశారు.

మరియొక అద్భుతం. ఒక వ్యాపారి శ్రీపాదులవారి భక్తుడు. తన వాణిజ్యంలో కనక లాభంవస్తే శ్రీపాదులవారి ప్రీతికొరకు బ్రాహ్మణ సంతర్పణ చేస్తానని మొక్కుకున్నాడు. స్వామి అనుగ్రహించారు. ఆ వ్యాపారి కోరిక ఫలించింది. తాను బ్రాహ్మణ సంతర్పణ చేస్తానని మొక్కుకున్నాడుగదా.

మొక్కు తీర్చుకోవటానికి కురుపురం బయలుదేరాడు. ప్రయాణములో రాత్రి అయింది. కొందరు దొంగలు స్నేహితులవలె ఆయనతో ప్రయాణించేస్తూ చీకటి పడగనే ఆ బ్రాహ్మణ వ్యాపారిని చంపివేశారు. ఆ బ్రాహ్మణుడు "స్వామీ! శ్రీపాద శ్రీవల్లభా! రక్షించు!" అంటూ ప్రాణాలు వదిలాడు. వెంటనే శ్రీపాద శ్రీవల్లభులు సాక్షాత్కరించారు. ఆ దొంగలను శూలంతో వధించారు. ఆ దొంగలలో ఒకడు "స్వామీ! రక్షించు రక్షించు. నేను బ్రాహ్మణుని చంపలేదు. నేను బాటసారినే. నాకు బ్రాహ్మణుని వధించి వాని సొమ్ము అపహరించవలెనను దుర్బుద్ధిలేదు. స్వామీ ! నీవు సర్వాంతర్యామివి. నా మనోగత స్థితిని పూర్తిగా తెలిసినవాడవు. నన్ను అనుగ్రహించు" అని ప్రార్థేయపడ్డాడు. స్వామి కరుణించి చనిపోయిన బ్రహ్మణుని తల మొండెమునకు అతికించి ప్రాణదానం చేశాడు. ఆ బ్రాహ్మణుడు మేల్కొనే లోపల అంతర్హితుడైనాడు. ఆ ప్రక్కనే నిలబడియున్న బాటసారిని, చచ్చిపడియున్న దొంగలను చూచి, విషయం అంతా తెలుసుకొని. "స్వామీ! నీ కరుణ అపారము. నిన్ను దర్శించే భాగ్యాన్ని నోచుకోలేదు నేను. అంతా నా దురదృష్టం. పూర్వజన్మలో నేనింతే నోచుకున్నాను" అని విలపించి కురుపురానికి వెళ్ళాడు. అక్కడ శ్రీపాద శ్రీవల్లభుల ప్రీతికొరకు తాను మ్రొక్కుకున్న 4000 మందికి సంతర్పణ చేసి కృతార్థుడైనాడు. శ్రీపాదస్వామి స్థూలదేహాన్ని తెర చాటు చేశారేకాని నిజభక్తులకు సాక్షాత్కరిస్తూనే ఉన్నారు. అభయ ప్రదానం చేస్తూనే వున్నారు.

శ్రీపాద శ్రీవల్లభులను కీర్తించి, ఆనందానుభూతులను పొందిన సిద్ధులు ఎందరో మహానుభావులున్నారు. శ్రీదత్తావతారములలో ఒక విశేషమున్నది. స్వామి మన కష్టములను తాను అనుభవించి, వారి సుఖములను మనకు అనుగ్రహిస్తాడు ఇది సత్యం.

శ్రీ దత్తభగవానుని అవతారమైన శ్రీపాద శ్రీవల్లభులు ఆశ్వీజ బహుళ ద్వాదశినాడు తన భౌతిక శరీరాన్ని గుప్తం చేశారుగదా. ఆ పుణ్యదినాన్నే "గురుద్వాదశి" అంటారు. దత్తక్షేత్రాలలో ముఖ్యంగా జరిగే పండుగలలో ముఖ్యమైనవి :

శ్రీ దత్త జయంతి - మార్గశిర శుద్ధ పూర్ణిమ

శ్రీపాద శ్రీ వల్లభుల అంతర్ధాన దినము - ఆశ్వీజ బహుళ ద్వాదశి (గురు ద్వాదశి)

శ్రీ నృశింహ సరస్వతీ స్వామివారి అంతర్ధాన దినము - మాఘ కృష్ణ పాడ్యమి గురు ప్రతిపద)

శ్రీ దత్త భగవానుడు ఎల్లప్పుడు షోడశ వర్షప్రాయుడనియు అనగా 16 సంవత్సరముల వయస్సు కలవాడనియు, తాను సంకల్ప మాత్రముచేతనే అన్నము అన్నగత ప్రాణులను సృష్టి, స్థితి, లయములను చేయు సర్వ సమర్థుడైననూ, మధ్యాహ్న సమయమున భిక్షాటన చేయుచున్నాడనియు, ఆ భిక్ష ఏమనగా మన పాపములనే తాను భిక్షగా స్వీకరించి మనలను పాప విముక్తులను చేయుచున్నాడనియు, శ్రీ దత్త ప్రభువు మహాత్ముల రూపంలో ఈ భూమిమీద సంచరిస్తూ ఉంటారనియు మనము పరిపూర్ణ విశ్వాసముతో అచంచల భక్తితో స్వామిని సేవించి తరించవలె. ఏ పనినైననూ ప్రారంభించుటకు ముందు శ్రీ దత్త భగవానుని ధ్యానము చేయుట

ఆవశ్యకము. నిజమైన ప్రభువు శ్రీ దత్త పరబ్రహ్మయే. మహనీయుల రూపములలో దత్త ప్రభువు దర్శనమిచ్చుచుండును. స్వామి తేజపుంజమునందు కోటి సూర్యుల ప్రకాశ మానముగా యుండుటచే సామాన్య సాధకులు స్వామిని దర్శించలేరు. అట్టి దర్శనమునకు ఈ చర్మ చక్షువులు చాలవు. ఒకవేళ అట్టి దర్శనము గలిగినచో భరించలేక వెంటనే రాలిపోవుదురు. కనుక అట్టి దర్శనమునకు ప్రయత్నించరాదు. అంటే దర్శనము కాదని కాదు. తప్పక ఒకానొక సమయమున దర్శనము అనగా ప్రభు సాక్షాత్కారము కలుగుతుంది. ఆ దర్శనము చూడగల శక్తిని అర్హతను ముందు సంపాదించుకోవాలి. సమయము రాగానే స్వామి తనంతట తానే దర్శనమిస్తారు. సంభాషిస్తారు. కనుక సాక్షాత్కారము కంటే అనుగ్రహమే ముఖ్యము. రాజుగారిని మనం ఊరేగింపులో చూస్తాం. అంటే దర్శనమైనది. కాని ఏమి ప్రయోజనము. అనుగ్రహం లేదు. మరియొకచోట రాజుగారి దర్శనం కాలేదు. కాని అనుగ్రహం కల్గింది. రావణాసురుడు ఈశ్వరుని తలచుకొనినప్పుడల్లా దర్శించాడు. కాని అనుగ్రహం పొందలేకపోయాడు. చివరకు శిక్షించబడ్డాడు. కనుక సాక్షాత్కారం కంటే, అనుగ్రహమే ముఖ్యం.

శ్రీ దత్త ప్రభువు స్మర్తృగామి. పలుకగనే పలికేవాడు. శరణాగత వత్సలుడు. భోగ మోక్షప్రదుడు. స్మరణ మాత్ర సంతుష్టుడు.

అందుకే - దత్త భక్తులు ఇలా కీర్తిస్తారు.

"దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా

దిగంబరా దిగంబరా! అవధూత చింతన దిగంబరా!

స్వామి ఇలా వచిస్తున్నారు.

"ఓ పిచ్చివాడా! నాపై నీకు ఈ ఒక్క జన్మలోనే అను రాగము తెలియును. కానీ నీపై నాకు గల అనురాగము తెలిసి నచో నీకు మతిభ్రమించి పిచ్చి పట్టును. అందుకే పూర్వజన్మ లను గుర్తు లేకుండా చేసినాను. నీకేది మేలు చేకూర్చునో దానిని నీవు అడుగకయే ఇవ్వనా? నీకు ఇవ్వనేమో అన్న సంశయము ఏర్పడుటకు కారణము నీపై నాకు కోట్ల జన్మల నుండి ఏర్పడిన నా అనురాగమును నీవు గుర్తించక పోవుటయే" అని శ్రీవారి దివ్యవాణి.

కనుక—

శ్లో॥ న దత్తాద పరో దేవః
న ప్రేమ్ణః పరసాధనమ్ః

అనగా- శ్రీ దత్తుని కన్నా వేరుదైవములేదు. దైవప్రేమకన్నా వేరు సాధనములేదు.

అందువలన—స్వామిని ఇలా ప్రార్థిద్దాము.

శ్లో॥ దేవదేవ శ్రీ దత్త పాహిపాహి ఉన్మత్త
త్వంమమైక ఆలంబో దత్త మేకమాలంబే

అనగా—

తా॥ శ్రీ దేవదేవా! శ్రీ దత్తా! ఓ ఉన్మత్తా! నన్ను రక్షించుము. రక్షించుము. నీవు ఒక్కడవే నాకాధారము. ఒక్కదత్తునే పట్టుకొందును.

ఓం తత్ సత్

శ్రీ దత్తార్పణమస్తు.

శ్రీదత్తప్రభువుకు వందనము సమర్పిద్దాము.

శ్లో॥ శ్యామలాం గిరిసుతాం సరస్వతీం
పాణ్డురాంచ కమలాం కలారుణామ్
దత్త ఏష పరిరభ్య భాసతే
సప్రయాగ ఇవవాహినీ త్రయః

తా॥ శ్యామలయైన పార్వతిని, తెల్లని సరస్వతిని, అరుణ వర్ణయగు లక్ష్మిని, కౌగిలించుకొని శ్రీ దత్తుడు గంగా - యమునా- సరస్వతీ నదులతో కూడిన ప్రయాగవలె భాసించు చున్నాడు.

శ్లో॥ దృష్ట త్రిమూర్తి భిరతర్పిత మానసేన
బ్రహ్మైవలోక పరమాగ్రహ నిశ్చలేన
అన్వేషితాయ చిరమత్రి మహర్షిణాతే
జ్వాలామయేన తపసామమ వన్దనాని"

తా॥ త్రిమూర్తులు గోచరించిననూ, తృప్తి చెందని మనస్సుతో, బ్రహ్మమును దర్శించవలెనని పట్టుదలతో జ్వాలలతో కూడిన తపస్సుతో అత్రిమహర్షి చేత అన్వేషించ బడిన వానికి నా నమస్కారములు.

శ్లో॥ ఏకో దత్తో బ్రహ్మదేవోఽస్యకర్తా
విష్ణుర్దేవోఽప్యేషలోకస్య భర్తా
ఈశో దేవో ఽ ప్యేషలోకాస్య హర్తా
భిన్నో రూపై ర్మాయయా భక్తహేతోః

తా॥ ఒకే దత్తుడు, ఈ జగత్కర్తయగు బ్రహ్మదేవునిగా, ఈలోక భర్తయగు శ్రీ విష్ణుదేవునిగాను, ఈలోక హర్తయగు ఈశ్వర దేవునిగాను, భక్తుల కోసము, మాయచేత భిన్న రూపములను ధరించుచున్నాడు.

శ్లో॥ మదిరాచషకేన దణ్డపాణిం
శునకై రావృత మన్త్య జాజ్ఞరూపమ్
పితృకర్మ పురోహితార్థమేతో
వికలః పశ్యతి భార్గవో ఽపి దత్తమ్.

తా॥ పితృకర్మ నాచరించుటకు పురోహితునిగా వరించి వచ్చిన పరశురాముడు, కల్లుకుండలతోను, కర్రచేతిలో నుండగా, కుక్కలతో చుట్టబడి చండాలరూపముతోనున్న స్వామిని వికలుడై చూచుచున్నాడు.

## అట్టి శ్రీ దత్త గురువుకు దండాలు
## అట్టి శ్రీ దత్త ప్రభువుకు-జేజేలు -

1. సృష్టికర్తకు-సృష్టిభర్తకు-సృష్టిహర్తకు-
పరబ్రహ్మకు। దత్త॥

2. వాణిభర్తయు-లక్ష్మీధవుడును-గౌరిపతియగు-
మూలవిరాట్టుకు। దత్త॥

3. ఆత్రిమూర్తులే-తనవేషములై -విశ్వమంతయును-
తానొకడేయగు। దత్త॥

4. శంఖచక్రముల డమరుశూలముల-కుండీమాలల-
పట్టినవటువుకు। దత్త॥

5. అత్రిపుత్రునకు-అనసూయపట్టికి-అనఘాప్రియునకు-
ఆనందాత్మకు। దత్త॥

6. వేదపురుషులే-శునకాకృతులతో పదములబ్రాలిన-
పావనమూర్తికి। దత్త॥

7. ధర్మదేవతయె-పాహిపాహియనిగోవుగచేరిన-
విశ్వపాలకునకు। దత్త॥

8. అష్టసిద్ధులును-వేయిచేతులను కార్తవీర్యునకు-
ఇచ్చినస్వామికి। దత్త॥

9. విష్ణుదత్తపితృ-శ్రాద్ధమునందునభోక్తగవచ్చిన-
మంత్రబ్రాహ్మణునకు। దత్త॥

10. వేదశాస్త్రముల-సారమునంతయు-పిండియిచ్చిన-
జ్ఞానసాగరునకు। దత్త॥

11. కనుసైగలతో-భోగమోక్షముల భక్తులకిచ్చెడి-
భగవంతునకు। దత్త॥
12. షోడశకళలతో-పూర్ణిమవెలుగుల...పదునారేడుల-
ముగ్ధబాలునకు। దత్త॥
13. చిలిపిచేష్టలతో-విశ్వనాటకమును...రక్తికిచేర్చెడి-
జగన్మోహనునకు। దత్త॥
14. పరశురామునకై-పరమాచార్యుడు-స్కందగురువుకై-
ఆధ్యాత్మిక గురువగు। దత్త॥
15. సృష్టిస్థితిలయ-కారణబ్రహ్మము-మూడుముఖముల
తానని తెల్పిన। దత్త॥
16. వేదముచెప్పిన-నిర్వచనమునకు-పూర్ణసమన్వయమగు
బ్రహ్మమునకు। దత్త॥

దత్త గురువుకు--దండాలు
దత్త ప్రభువుకు-జేజేలు-

-దత్త భక్తులు-

ఓం తత్ సత్
శ్రీ గురుదత్త

# శ్రీ దత్త స్తుతి గీతం

గురు మహారాజ్ గురు జైజై పరబ్రహ్మ సద్గురు।
దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా।
దత్తమార్ఖిమాతా।దత్తమర్ఖుపితా।
బహినబంధు సురతా దత్తమాధా॥

గురు మహారాజ్॥
దత్త మాధగురూ। దత్త మధతారూ।
మర్ఖుచి ఆధారు। దత్తరాజు।
గురుమహారాజ్॥

దత్తమార్ఖిధరూ దత్తమార్ఖిమరూ
సోయిర స్తజనా దత్తా మాచా
దత్తమార్ఖిమాతా। దత్త మార్ఖుపితా।
బహినబంధు సురతా దత్తమాధా।
ఏకజనార్ధని దత్తమవిశావా
నవిచారతా తనలావెచాచా
దత్త మార్ఖిమాతా దత్త మర్ఖుపితా
బహినబంధు సురతా దత్తమాధా॥

గురుమహారాజ్ గురు జైజై
పరబ్రహ్మ సద్గురు!
దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా।

శ్రీ గురుదత్త శ్రీదత్త దివ్య సందేశము శ్రీ గురుదత్త

# దృష్టిని బట్టియే సిద్ధి

భక్త మహాశయులారా !

నేనే పరబ్రహ్మమని గుర్తించుట లక్ష్యముయొక్క మహా రహస్యము. ఇక లక్ష్యమును చేరు మార్గముయొక్క మహా రహస్యమేమనగా, ప్రతి ఫలాపేక్షలేని నిస్వార్థ నిర్మల ప్రేమయే. అట్టి ప్రేమతోకూడిన జ్ఞానముకాని, భజనకాని, యజ్ఞ జపాది కర్మగాని మార్గమే అగును. పంచదార చిలక అయితేనేమి? హంస అయితేనేమి? గుర్రమైననేమి? ఏది తిన్ననూ పంచదార తిన్నట్లేగదా.కాన నేను ప్రీతి నొందెదను.

స్వార్థముతోకూడిన ప్రతి ఫలాపేక్షతోకూడిన వ్యాపార మయమైన జ్ఞాన-భక్తి-కర్మలేవి యైననూ నాకు రుచించవు. మట్టితో చేసిన చిలక, హంస, గుర్రము వేదియును మట్టియే కదా. రుచింపవుకదా.

ఈ మహా రహస్యములను రెండింటిని తెలిసిన జీవుడు తప్పక నన్ను చేరును. నా నిత్య సాన్నిధ్య శాశ్వత బ్రహ్మా నంద భాగ్యమును పొందును.

ఒక శివలింగమును భక్తుడు తన్మయభావంతో చూస్తాడు. దానినే నాస్తికుడు రాయిలాగా చూస్తాడు. దృష్టిని బట్టియే సిద్ధి.

ఓం శాంతి శాంతి శాంతిః